ప్రజాసంక్షేమం కోసమే..



టీడీపీ, జనసేన, బీజేపీ రాజకీయం, అధికారం కోసం కలవలేదు. రాష్ట్ర ప్రజల సంక్షేమం కోసం, రాష్ట్ర అభివృద్ధి కోసం కలిశాయి. కూటమిలోని ప్రతి పార్టీనీ సమాన భాగస్వామిగానే భావిస్తున్నాం. చంద్రబాబు అనుభవం, పవన్ కల్యాణ్ జోష్.. మోదీ బలంతో రాష్ట్రంలో అధికారంలోకి రాబోతున్నాం. కేంద్రంలో 400కుపైగా సీట్లతో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయాలన్న లక్ష్యంతో మోదీ ముందుకు సాగుతున్నారు. నియోజకవర్గ స్థాయిలో మరింత మెరుగ్గా కలిసి పనిచేయాలని నిర్ణయించాం. డబుల్ ఇంజిన్ సర్కారు కోసం కూటమి నాయకులు సమష్టిగా పనిచేస్తాం. ఇది మూడు పార్టీ కలయిక. తెలుగు ప్రజల మేల కలయిక.

- పయ్యావుల కేశవ్, పీఏసీ చైర్మన్

రాష్ట్ర భవిష్యత్తు కోసమే...



పవిత్రమైన గంగా, యమున, సరస్వతి సంగమం తరహాలో రాష్ట్రానికి మంచి భవిష్యత్తు ఇవ్వడం కోసం ఎన్డీయే కూటమి ఏర్పడింది. వైసీపీ అరాచకానికి చరమగీతం పాడేందుకు ఎన్డీయే కూటమి ముందుకొచ్చింది. వైసీపీ ఐదేళ్ల పరిపాలన అంతా అరాచకమే. అభివృద్ధి, సంక్షేమం కుంటుపడ్డాయి. మహిళలు, యువత, రైతులతోపాటు అన్ని వర్గాల ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. వైసీపీని తరిమితరిమికొట్టేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారు. ఉమ్మడి జిల్లాలో 14 అసెంబ్లీ, రెండు ఎంపీ స్థానాలను కైవసం చేసుకోవడం ఖాయం.

- అంబికా లక్ష్మీనారాయణ, ఎంపీ అభ్యర్థి

అభివృద్ధి.. సంక్షేమం కోసమే..



రాష్ట్ర అభివృద్ధి, ప్రజల సంక్షేమం కోసం ఎన్డీయే కూటమి ఏర్పడింది. టీడీపీ, జనసేన నాయకులు, కార్యకర్తలతో కలిసి బీజేపీ శ్రేణులు క్షేత్ర స్థాయిలో ఎన్నికల ప్రచారం చేస్తాయి. జగన్‌రెడ్డి పాలనలో అన్ని వర్గాల ప్రజలకు తీరని అన్యాయం జరిగింది. రాష్ట్రాన్ని 20 ఏళ్లు వెనక్కి తీసుకువెళ్లారు. అరాచక పాలనకు చరమగీతం పాడేందుకే మూడు పార్టీలు ఒక్కటయ్యాయి. రాష్ట్రంలో చంద్రబాబు సీఎం అవ్వడం, కేంద్రంలో మోదీ ప్రధాని కావడం ఖాయం.

- సందిరెడ్డి శ్రీనివాసులు, బీజేపీ జిల్లా అధ్యక్షుడు

కలిసి పనిచేద్దాం..

అరాచక వైసీపీని సాగనంపుదాం

డబుల్ ఇంజిన్ ప్రభుత్వ ఏర్పాటే లక్ష్యం

అంతర్గత సమావేశంలో బీజేపీ, జనసేన, టీడీపీ

ఎన్నికల కార్యాచరణపై చర్చ.. కీలక నిర్ణయాలు



సమావేశంలో పాల్గొన్న టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు

అనంతపురం, ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఐదేళ్లు అరాచక పాలన సాగించిన అధికార వైసీపీని సాగనంపేందుకు టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి అభ్యర్థులు సార్వత్రిక ఎన్నికల వ్యూహానికి పదునుపెట్టారు. సమష్టిగా జనంలోకి వెళ్లేందుకు సంసిద్ధులయ్యారు. ఇందులో భాగంగా నగరంలోని ఓ హోటల్‌లో అనంతపురం పార్లమెంటు నియోజకవర్గ పరిధిలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల కూటమి అభ్యర్థులు, ముఖ్య నాయకులు సోమవారం సమావేశమయ్యారు. టీడీపీ, జనసేన, బీజేపీ పార్లమెంటు స్థాయి ఉమ్మడి సమన్వయ కమిటీ సమావేశం నిర్వహించారు. టీడీపీ జిల్లా అధ్యక్షుడు, రాయదుర్గం నియోజకవర్గ ఇన్‌చార్జి కాలవ శ్రీనివాసులు, బీజేపీ జిల్లా అధ్యక్షుడు సందిరెడ్డి శ్రీనివాసులు, జనసేన జిల్లా అధ్యక్షుడు టీసీ వరుణ్, అనంతపురం ఎంపీ అభ్యర్థి అంబికా లక్ష్మీనారాయణ, ఉరవకొండ ఎమ్మెల్యే పయ్యావుల కేశవ్, అనంతపురం అర్బన్, శింగనమల, గుంతకల్లు, కళ్యాణదుర్గం నియోజకవర్గాల కూటమి అభ్యర్థులు దగ్గుబాటి వెంకటేశ్వర ప్రసాద్, బండారు శ్రావణిశ్రీ, గుమ్మనూరు జయరాం, అమిలినేని సురేంద్రబాబు, కూటమి ముఖ్య నాయకులు ఈ సమావేశంలో పాల్గొని, సార్వత్రిక ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహం గురించి దాదాపు గంటపాటు చర్చించారు. పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. ఎన్నికల నోటిఫికేషన్‌కు మరో పది రోజుల గడువు ఉన్న నేపథ్యంలో ఓటరు జాబితా వెరిఫికేషన్, కొత్త ఓటర్లు, ఇతర ప్రాంతాల్లో నివసించే ఓటర్లు, పోస్టల్ బ్యాలెట్లు, బూత్ ఏజెంట్లు తదితర అంశాల గురించి ప్రధానంగా చర్చించారు. అనంతపురం పార్లమెంటు నియోజకవర్గ పరిధిలో భారీ బహిరంగ సభలు నిర్వహించాలని నిర్ణయించారు. సామాజిక మాధ్యమాలలో ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థుల ప్రచారాన్ని విస్తృతం చేసేలా ప్రణాళికను రూపొందించారు. నియోజకవర్గాల్లో కూటమి సమన్వయ కమిటీ సమావేశాలు నిర్వహించి, ఒకే మాట.. ఒకే బాటగా ప్రజల్లోకి వెళ్లాలని నిర్ణయం తీసుకున్నారు. నియోజకవర్గాలలో స్థానిక సమస్యలే అజెండాగా ప్రచారాన్ని ఉధృతం చేయాలని నిర్ణయం తీసుకున్నారు. కూటమి అభ్యర్థి నేతృత్వంలో నియోజకవర్గ కార్యాచరణ ప్రణాళికను రూపొందించుకోవాలని నిర్ణయం తీసుకున్నారు. ఎన్నికల ప్రణాళికను అమలు చేస్తూనే... వైసీపీ అరాచక పాలనను ఎండగట్టాలని నిర్ణయం తీసుకున్నారు. 2014 నుంచి 2019 టీడీపీ ప్రభుత్వంలో ప్రజా సంక్షేమం, అభివృద్ధి గురించి ప్రజలకు వివరించాలని, గడిచిన ఐదేళ్లలో ప్రజా సంక్షేమానికి, అభివృద్ధికి వైసీపీ ప్రభుత్వం ఎంత ఖర్చు పెట్టిందో లెక్కలతో వివరించాలని నిర్ణయించారు. అరాచక వైసీపీని ఇంటికి సాగనంపడం, డబుల్ ఇంజిన్ ప్రభుత్వాన్ని తెచ్చుకోవడమే లక్ష్యంగా ఈ అంతర్గత సమావేశం సాగింది. సమావేశంలో టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీధర్‌చౌదరి, శింగనమల ద్విసభ్య కమిటీ సభ్యుడు ఆలం నరసానాయుడు, జనసేన జిల్లా ఉపాధ్యక్షుడు అంకె ఈశ్వరయ్య, బీజేపీ ముఖ్య నాయకులు లలిత్‌కుమార్, వెంకటేశ్వరరెడ్డి, ప్రతాప్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. సమావేశం అనంతరం కూటమి ముఖ్య నేతలు మీడియాతో మాట్లాడారు.

జగన్ ప్రభుత్వాన్ని దించడమే లక్ష్యం..



మూడు పార్టీలు కలిసి పనిచేసి జిల్లాలోని ఏడు నియోజకవర్గాల్లో ఎమ్మెల్యే అభ్యర్థులు, ఎంపీ అభ్యర్థిని అత్యధిక మెజారిటీతో గెలిపించుకోవాలని ఏకగ్రీవంగా తీర్మానం చేశాం. ఎన్నికల వ్యూహ రచనలో మూడు పార్టీల భాగస్వామ్యం ఉంది. వాటి అమలులో నాయకులు, కార్యకర్తలు, అనుబంధ విభాగాల నాయకుల పాత్ర ఉండాలని నిర్ణయించాం. జగన్‌రెడ్డిని ఎప్పుడెప్పుడు దించేద్దామా.. చంద్రబాబు సుపరిపాలనను తెచ్చుకుందామా అని ప్రజలు ఆతృతగా ఎదురుచూస్తున్నారు. రాష్ట్రంలో 160 అసెంబ్లీ, 23 పార్లమెంట్ స్థానాలకు తగ్గకుండా గెలుస్తాం. కేంద్రం, రాష్ట్రంలో డబుల్ ఇంజిన్ సర్కార్ ఏర్పాటు కావడం ఖాయం. ఐదేళ్ల వైసీపీ పాలనలో విధ్వంసం, అరాచకం సాగింది. అన్ని వర్గాల ప్రజలు తీవ్ర అన్యాయానికి గురయ్యారు. సంక్షేమంలో కోతలే కోతలు. అభివృద్ధి శూన్యం. రాష్ట్ర ప్రజలను చూపించి రూ.12 లక్షల కోట్లు జగన్ అప్పుగా తెచ్చాడు. బటన్ నొక్కి ఇచ్చిన రూ.2.70 లక్షల కోట్లల్లో రూ.1.35 కోట్లు కేంద్రం నుంచి వచ్చిందే. మిగిలిన డబ్బులు ఎవరి జేబులోకి వెళ్లాయో జగన్ ప్రభుత్వమే చెప్పాలి. మద్యం పాలసీని ప్రధాన ఆదాయ వనరుగా మార్చుకుని ప్రజల ఆరోగ్యంతో జగన్ చెలగాటమాడారు. మద్యంపై వచ్చే ఆదాయాన్ని 20 ఏళ్లపాటు తాకట్టుపెట్టి అప్పుతెచ్చిన నీచ చరిత్ర జగన్‌రెడ్డిది.

- కాలవ శ్రీనివాసులు, టీడీపీ జిల్లా అధ్యక్షుడు

విజయమే లక్ష్యం...



జిల్లాలోని కూటమి అభ్యర్థుల విజయమే లక్ష్యంగా పనిచేస్తాం. టీడీపీ, బీజేపీ శ్రేణులను సమన్వయం చేసుకొని జనసైనికులు క్షేత్ర స్థాయిలో అభ్యర్థుల విజయానికి సహకరిస్తారు. వైసీపీ అరాచక పాలనకు చరమగీతం పాడేందుకు అన్ని వర్గాల ప్రజలు సిద్ధంగా ఉన్నారు. రాబోయేది కూటమి ప్రభుత్వమే.

- టీసీ వరుణ్, జనసేన జిల్లా అధ్యక్షుడు

సమాచారాన్ని సిద్ధం చేసుకోండి: కలెక్టర్

అనంతపురం టౌన్: జిల్లాకు త్వరలో ఎన్నికల పరిశీలకులు వస్తారని, ఎన్నికలకు సంబంధించిన ప్రతి సమాచారాన్నీ దగ్గర పెట్టుకోవాలని లైజన్ అధికారులకు కలెక్టరు వినోద్ కుమార్ సూచించారు. కలెక్టరేట్‌లో సోమవారం ఆయన సమావేశం నిర్వహించారు. పరిశీలకులు ఏ సమాచారం అడిగినా వెంటనే ఇచ్చేందుకు సిద్ధంగా ఉండాలని సూచించారు.



పండుగ సామగ్రి కొనుగోలుదారులతో కిటకిటలాడుతున్న అనంతపురం పాతూరు మార్కెట్

తెలుగు పండుగ

నేడు ఉగాది పర్వదినం

తెలుగువారి తొలి పండుగ.. ఉగాది. తెలుగు సంవత్సరపు తొలి రోజు.. చైత్రశుద్ధ పాడ్యమినాడు వచ్చే ఈ పండుగ.. ప్రకృతితో ముడిపడిన వేడుక. ఆకులు రాలే శిశిరకాలం తర్వాత వచ్చే చైత్ర మాసంలో వృక్షాలు కొత్త చివుళ్లు తొడుగుతాయి. వాటిని తిన్న కోయిలలు కుహూ కుహూ రాగాలతో అలరిస్తాయి. క్రోధి నామ సంవత్సర ఉగాదిని మంగళవారం నిర్వహించుకునేందుకు జిల్లా ప్రజలు సిద్ధమయ్యారు. కలిమిలేములలో జీవిత మాధుర్యాన్ని చాటే షడ్రుచుల ఉగాది పచ్చడి.. ఈ రోజు ప్రత్యేకం. కొత్త చింతపండు(పులుపు), లేత మామిడి ముక్కలు(వగరు), బెల్లం(తీపి), వేపపూత(చేదు), ఉప్పు, మిరియాల పొడి(కారం) వినియోగించి ఉగాది పచ్చడిని తయారు చేస్తారు. ఈ ఆరు రుచులూ జీవితంలో ఎదురయ్యే వివిధ రకాల అనుభవాలను సూచిస్తాయని, అన్నింటినీ స్వీకరించాలన్నదే సారాంశం. పంచాగ పఠనానికి పండితులు, శ్రవణానికి ప్రజలు సిద్ధమయ్యారు. ఇందుకు పలు ఆలయాలు, ఆధ్యాత్మిక కేంద్రాలు వేదిక కానున్నాయి. ఇప్పటికే సర్వాంగ సుందరంగా ముస్తాబయ్యాయి. జిల్లాకేంద్రంలోని ఆర్‌ఎఫ్ రోడ్డు లక్ష్మీవెంకటేశ్వర దేవాలయం, పాతూరు చెన్నకేశవస్వామి ఆలయం, మొదటిరోడ్డు కాశీవిశ్వేశ్వర కోదండ రామాలయం, కొత్తూరు, పాతూరు వాసవీ కన్యకాపరమేశ్వరి దేవాలయాల్లో విశేష వేడుకలను నిర్వహించనున్నారు. పండుగ నేపథ్యంలో మార్కెట్లు సోమవారం కొనుగోలుదారులతో కిటకిటలాడాయి. కొత్త బట్టలు, పండుగ సరుకుల కొనుగోలు కోసం ఉదయం, సాయంత్రం వేళల్లో దుకాణాలకు వెళ్లారు.

- అనంతపురం కల్చరల్





పాతూరు మార్కెట్‌లో పూలు, మామిడి ఆకుల కొనుగోలు



చంద్రబాబును కలిసిన మాజీ ఎమ్మెల్యేలు జితేంద్రగౌడ్, వైకుంఠం ప్రభాకర్ చౌదరి

అర్థం చేసుకోండి..!

బీజేపీ, జనసేనతో పొత్తు కారణంగా కొందరికి టిక్కెట్లు ఇవ్వలేకపోయామని, అర్థం చేసుకుని పనిచేయాలని టీడీపీ అధినేత చంద్రబాబు అసంతుష్టులకు సూచించారు. ఈ ఎన్నికల్లో టిక్కెట్ దక్కని నాయకులను హైదరాబాద్‌లోని తన నివాసానికి సోమవారం పిలిపించుకుని బుజ్జగించారు. జిల్లా నుంచి మాజీ ఎమ్మెల్యేలు వైకుంఠం ప్రభాకర్ చౌదరి, జితేంద్రగౌడ్ హైదరాబాద్ వెళ్లి చంద్రబాబును కలిశారు. సీట్ల సర్దుబాటును అర్థం చేసుకొని అభ్యర్థుల గెలుపు కోసం కృషి చేయాలని వారికి చంద్రబాబు సూచించారు. పార్టీ అధికారంలోకి రాగానే తగిన పదవులు ఇస్తామని చంద్రబాబు హామీ ఇచ్చినట్లు సమాచారం.

- అనంతపురం అర్బన్

వైసీపీకి శమంతకమణి రాజీనామా

శింగనమల, ఏప్రిల్ 8: మాజీ మంత్రి శమంతకమణి వైసీపీకి సోమవారం రాజీనామా చేశారు. శింగనమల టిక్కెట్‌ను శమంతకమణి కుమారుడు అశోక్ ఆశించారు. కానీ ప్రభుత్వ సలహాదారు ఆలూరు సాంబశివారెడ్డి టిప్పర్ డ్రైవర్ వీరాంజనేయులుకు టిక్కెట్ దక్కింది. దీంతో తీవ్ర అసంతృప్తికి లోనైన శమంతకమణి కుటుంబం.. పార్టీని వీడాలని నిర్ణయించుకుంది. మూడు రోజుల క్రితం ఆమె కూతురు, మాజీ ఎమ్మెల్యే యామిని బాల వైసీపీకి రాజీనామా చేశారు. తాజాగా శమంతకమణితోపాటు ఆమె కుమారుడు అశోక్ పార్టీని వీడారు. ఏ పార్టీలో చేరేదీ త్వరలో ప్రకటిస్తామని శమంతకమణి తెలిపారు.

ఉష్ణోగ్రతలు (సోమ)

గరిష్ఠం	42.0
కనిష్ఠం	26.0



ఇఫ్తార్	మంగళవారం సాయంత్రం	06:34
సెహరీ	బుధవారం ఉదయం	04:53

టీడీపీ విజయం ఎప్పుడో ఫిక్స్

కూటమి అర్బన్ ఎమ్మెల్యే అభ్యర్థి దగ్గుబాటి ప్రసాద్


ఎన్నికల ప్రచారంలో అభివాదం చేస్తున్న దగ్గుబాటి ప్రసాద్


తనకు ఓటు వేయాలని అభ్యర్థిస్తున్న దగ్గుబాటి

అనంతపురం అర్బన్, ఏప్రిల్ 8: టీడీపీ విజయం ఎప్పుడో ఫిక్ అయ్యిందని అనంతపురం అర్బన్ టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి దగ్గుబాటి వెంకటేశ్వరప్రసాద్ స్పష్టంచేశారు. సోమవారం ఉదయం 44, 45 డివిజన్లు, సాయంత్రం 28వ డివిజన్ పరిధిలోని అశోక్ నగర్‌లో నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో ఆయన మాట్లాడారు. ఏ కాలనీలో చూసినా సమస్యలే కనిపిస్తున్నాయని, వైసీపీ నాయకులేమో ఐదేళ్లల్లో అంతా అభివృద్ధి చేశామని గొప్పలుపోతున్నారని, ఎక్కడ మీరు చేసిన అభివృద్ధి అంటూ నిలదీశారు. కొందరికి మాత్రమే సంక్షేమ పథకాలు వర్తింప జేసి అందరినీ ఉద్ధరించామని చెప్పుకోవడం సిగ్గుచేట న్నారు. ఈ ఎన్నికల్లో టీడీపీని గెలిపించాలని ఏనాడో ప్రజలు నిర్ణయిం చుకున్నారన్నారు. ఇప్పటికీ ఆ వాస్తవ విషయాన్ని వైసీపీ నాయకు లు గమనించలేకపోతున్నారన్నారు. కార్యక్రమంలో టౌన్ బ్యాంక్ చైర్మన్ జేఎల్ మురళీధర్, మాజీ మేయర్ స్వరూప, నాయకులు బుగ్గయ్య చౌదరి, ప్రకాష్‌నాయుడు, దళవాయి వెంకటనారాయణ, సిమెంట్ పోలన్న, రాయల్ మురళీ, రాజారావు, పోతుల లక్ష్మీనర సింహులు, వెంకట రామయ్య, ఫయాజ్, లింగారెడ్డి, కూచి హరి, నెట్టెం బాలకృష్ణ, సంగా తేజస్విని, ప్రవీణ్‌కుమార్, జగదీష్, మురళీ కుమార్, కడియాల కొండన్న, లక్ష్మీదేవి, దేవి పాల్గొన్నారు.

చంద్రబాబు అంటేనే విజన్ : చంద్రబాబు అంటనే విజన్ అని దగ్గుబాటి పేర్కొన్నారు. స్థానిక శ్రీనగర్ కాలనీలో అనంతపురం అర్బన్ టీడీపీ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ... జగన్ అరాచక పాలనలో అధోగతిపాలైన రాష్ట్రాన్ని కాపాడాలంటే చంద్రబాబుతోనే సాధ్యమన్నారు. పింఛన్ల విషయంలో వైసీపీ శవరాజకీయాలు చేయడం హేయమన్నారు. ముందు అనంత అర్బన్ ప్రజలకు ఆయన ఉగాది శుభాకాంక్షలు తెలిపారు.

సంపద సృష్టికర్త చంద్రబాబే

కూటమి రాప్తాడు ఎమ్మెల్యే అభ్యర్థి పరిటాల సునీత

రామగిరి, ఏప్రిల్ 8: రాష్ట్రంలో సంక్షేమం, సంపద సృష్టించాలంటే ఒక్క చంద్రబాబు వల్లే సాధ్యమని మాజీ మంత్రి, రాప్తాడు కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి పరిటాల సునీత పేర్కొన్నారు. సోమవారం రామగిరి మండలంలోని వెంకటాపురం గ్రామంలో గరిమేకలపల్లి నుంచి 15 కుటుంబాలు, కుంటిమద్ది నుంచి 3 కుటుంబాలు ఆమె ఆధ్వర్యంలో టీడీపీలోకి చేరాయి. ఆమె మాట్లాడుతూ... సృష్టించిన సంపద ఎలా ఖరుపెట్టాలో చంద్రబాబుకే తెలుసన్నారు. రాష్ట్రంలో ఉన్న ఆదాయవనరులను దృష్టిలో ఉంచుకునే తాము హామీలు ఇస్తున్నామని స్పష్టం చేశారు. వైసీపీలాగా చెప్పింది ఒకటి... చేసేది ఒకటిలా ఉండదన్నారు. పింఛన్ల విషయంలోనూ ప్రభుత్వం శవరాజకీయాలు చేసిందని, కానీ లబ్ధిదారులు వాస్తవాన్ని గుర్తించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ సీనియర్ నాయకుడు ఎల్ నారాయణచౌదరి, బీసీసెల్ జిల్లా అధ్యక్షుడు కుంటి మద్దిరంగయ్య, మండల కన్వీనర్ సుధాకర్, ప్రధాన కార్యదర్శి మారుతీప్రసాద్, నాయకులు మాధాపురం శంకర్ పాల్గొన్నారు.


పరిటాల సునీత సమక్షంలో టీడీపీలో చేరిన వైసీపీ నేతలు

రాప్తాడులో జయహో బీసీ

రాప్తాడు : రాప్తాడు టీడీపీ కార్యాలయంలో మండల కన్వీనర్ కొండప్ప ఆధ్వర్యంలో జయహో బీసీ కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. టీడీపీతోనే బీసీలు రాజకీయంగా, ఆర్థికంగా, సామాజికంగా అన్ని రంగాల్లో అభివృద్ధి చెందారని బీసీ నాయకులు తెలిపారు. కార్యక్రమంలో బీసి సెల్ రాష్ట్ర కార్యదర్శి నారాయణ స్వామి, కురుబ సాధికార సమితి రాష్ట్ర కన్వీనర్ గంగలకుంట రమణ, తెలుగు రైతు రాష్ట్ర ఉపాధ్యక్షుడు సాకే నారాయణస్వామి, బీసీ సెల్ కో ఆర్డినేటర్లు వడ్డే నాగేంద్ర, పోతులయ్య, తెలుగు రైతు ఉపాధ్యక్షుడు వెంకటరాముడు పాల్గొన్నారు.

టీడీపీలోనే దళితులకు న్యాయం

కూటమి శింగనమల ఎమ్మెల్యే అభ్యర్థి బండారు శ్రావణిశ్రీ

శింగనమల, ఏప్రిల్ 8: టీడీపీలోనే దళితులకు సామాజిక న్యాయం సాధ్యమని శింగనమల కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి బండారు శ్రావణిశ్రీ అన్నారు. సోమవారం అనంతపురంలోని కనకదాస కళ్యాణమండపంలో నియోజకవర్గంలోని ఆరు మండలాల దళిత సంఘం నాయకులతో నిర్వహించిన ఆత్మీయ సమ్మేళనంలో ఆమె మాట్లాడారు. దళితలు సామాజిక, రాజకీయ, విద్య, ఉపాధి రంగాల్లో అభివృద్ధి కేవలం టీడీపీతోనే సాధ్యమన్నారు. దళిత బిడ్డను ఎన్నికలో గెలిపిస్తే దళితుల సంక్షేమం కోసం కృషి చేస్తానన్నారు.

టీడీపీలో వైసీపీ నాయకుల చేరిక

శింగనమల వైసీపీ అభ్యర్థి వీరాంజనేయులు సొంత గ్రామమైన సీ.బండమీదపల్లికు చెందిన 50 వైసీపీ కుటుంబాలు బండారు శ్రావణి ఆధ్వర్యంలో టీడీపీ తీర్థం పుచ్చుకున్నాయి. కార్యక్రమంలో టీడీపీ మండల కన్వీనర్ ఆదినారాయణ, డేగల కృష్ణమూర్తి, మారుతి నాయుడు, అబ్దుల్ జీలాని, చితంబరి దొర, నెట్టికంటి, చంద్రాయుడు, ప్రతాప్, రమణ, గుర్రం లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.


దళిత ఆత్మీయ సమ్మేళనంలో బండారు శ్రావణిశ్రీ

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి

నార్పల, ఏప్రిల్ 8: మండలంలోని కేశేపల్లి గ్రామంలో సోమవారం రాత్రి బండి నాగనంద (45) అనుమానాస్పదస్థితిలో మరణించాడు. అతను, భార్య జ్యోతి కలసి మగ్గం వేస్తూ జీవనం సాగిస్తున్నారు. సోమవారం రాత్రి అతను ఇంట్లో చేతులు వెనక్కు కట్టేసుకుని... కుర్చీలో కూర్చొని... ఉరేసుకొని... చనిపోయి ఉండటాన్ని స్థానికులు గమనించారు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటన స్థలాన్ని పరిశీలించారు. చేతులు వెనక్కు కట్టేసుకుని ఎలా ఉరేసుకున్నారనే అనుమానాన్ని వ్యక్తం చేశారు. నాగనందకు కుమారుడు, కుమార్తె ఉన్నారు. కేసు దర్యాప్తులో ఉందని, పూర్తి వివరాలు తెలియాల్సి ఉందని ఎస్ఐ రాజశేఖర్ రెడ్డి తెలిపారు.

రైతు కుటుంబాన్ని ఆదుకోవాలి

అనంతపురం ప్రెస్‌క్లబ్, ఏప్రిల్ 8: పంటలు పండక.. అప్పుల బాధతో ఆత్మహత్య చేసుకున్న కూడేరు మండలం కడదరకుంట గ్రామానికి చెందిన రైతు సంగప్ప కుటుంబాన్ని ఆదుకోవాలని మానవ హక్కుల వేదిక జిల్లా ప్రధాన కార్యదర్శి సుబ్బన్న డిమాండ్ చేశారు. సోమవారం ఆయన కడదరకుంట గ్రామానికి వెళ్లి సంగప్ప కుటుంబసభ్యులు, గ్రామ రైతులను కలిసి వివరాలు సేకరించారు. దీనికి సంబంచిన రిపోర్టును తయారు చేసి అధికారులకు పంపిస్తానన్నారు. తక్షణమే బాధిత కుటుంబానికి అప్పుల వారి నుంచి రక్షణ కల్పించాలన్నారు. రూ.5 లక్షల ఆర్థిక సాయాన్ని సంగప్ప భార్యకు అందించి ఆదుకోవాలన్నారు. సంగప్ప ముగ్గురు పిల్లలకు ప్రభుత్వ హాస్టళ్లల్లో చేర్పించాలన్నారు. కౌలు రైతులకు చట్ట ప్రకారం కడరదకుంట గ్రామంలో ఒక్కరికి కూడా కార్డులు అందజేయకపోవడం బాధాకరమన్నారు.

వడదెబ్బపై అవగాహన ర్యాలీ

నార్పల, ఏప్రిల్ 8: మండలంలోని బొందలవాడ గ్రామంలో విలేజి హెల్త్ క్లినిక్ సిబ్బంది సోమవారం వడదెబ్బపై అవగాహన ర్యాలీ నిర్వహించింది. వైద్య సిబ్బంది మాట్లాడుతూ... ఎండలో ఎక్కువసేపు ఉండరాదని, దీని ద్వారా వాంతులు, విరేచనాలు కలగడం, తలనొప్పి తదితర లక్షణాలు ఉన్నట్లుయితే వెంటనే సమీప ఆసుపత్రికి వెళ్లి తగిన చికిత్స తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్ శ్రీరాములు, కిరణ్‌కుమార్, చంద్రకళ, వరలక్ష్మి, 104 సిబ్బంది, గ్రామ సచివాలయ సిబ్బంది, ఆశా కార్యకర్తలు, పాల్గొన్నారు.

నిష్పక్షపాత ఎన్నికలే లక్ష్యం : ఎస్పీ



అనంతపురం క్రైం, ఏప్రిల్ 8: జిల్లాలో పారదర్శక, నిష్పక్షపాత ఎన్నికలే లక్ష్యంగా పోలీసు వ్యవస్థ పనిచేయాలని జిల్లా ఎస్పీ అమిత్ బర్దర్ సూచించారు. స్థానిక పోలీసు కాన్ఫరెన్స్ హాలులో పోలీసు అధికారులతో సోమవారం నిర్వహించిన ప్రత్యేక సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్నికల కమిషన్ నియమ నిబంధనలు అందరూ తప్పకుండా పాటించాలన్నారు. ప్రజలు స్వేచ్ఛగా, నిర్భయంగా ఓటు హక్కు వినియోగించుకునేలా పటిష్ట చర్యలు తీసుకోవాలన్నారు.

తాగునీటి సమస్యను పరిష్కరించండి

నార్పల, ఏప్రిల్ 8: నార్పల మేజర్ పంచాయతీలోని సీపీఐ కాలనీలో తీవ్ర తాగునీటి ఎద్దడి నెలకొందని , వెంటనే దాన్ని పరిష్కరించాలని ఎంపీడీఓకు సీపీఐ నాయకులు సోమవారం వినతి పత్రాన్ని అందజేశారు. కాలనీలోని బోర్లు అడుగంటి పోయామని, కాలనీలో పంచాయతీ వాటర్ రాక సీపీఐ కాలనీవాసులు తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. తక్షణమే నీటి సమస్యను తీర్చాలని కోరారు. వినతి పత్రం ఇచ్చిన వారిలో సీపీఐ మండల కార్యదర్శి గంగాధర్, సహాయ కార్యదర్శి రమేష్, కాలనీ వాసులు, పాల్గొన్నారు.

తనిఖీలను ముమ్మరంగా చేపట్టండి

చెన్నేకొత్తపల్లి, ఏప్రిల్ 8: ఎన్నికల సమయాన్ని దృష్టిలో ఉంచుకుని సిబ్బంది అప్రమత్తంగా ఉంటూ తనిఖీలు ముమ్మరంగా చేపట్టాలని విజయవాడ సెబ్ డిప్యూటి కమిషనర్ నాగమద్దయ్య ఆదేశించారు. చెన్నేకొత్తపల్లిలోని సెబ్ స్టేషన్‌ను సోమవారం తనిఖీ చేసిన ఆయన మాట్లాడారు. పాత నేరస్థుల మీద నిఘా ఉంచాలన్నారు. అక్రమ మద్యాన్ని తరలించే మార్గాలలో రూట్‌వాచ్‌లు నిర్వహించాలని, ఇతర రాష్ట్రాల నుంచి వచ్చే మద్యాన్ని రాష్ట్రంలోకి రానివ్వకుండా చర్యలు తీసుకోవాలని అన్నారు. విధుల్లో ఏ మాత్రం అలసత్వం వహిస్తే క్రమశిక్షణా చర్యలు తప్పవని హెచ్చరించారు. ఎన్నికల కమిషన్ నిబంధనలకు లోబడి బాధ్యతతో పనిచేయాలని, ఎలాంటి రాజకీయ ఒత్తిళ్లకు తలొగ్గకుండా పనిచేయాలని సెబ్ సిబ్బందిని ఆదేశించారు. ఆయన వెంట అసిస్టెంట్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సూపరింటెండెంట్ సుబ్రమణ్యం, సెబ్‌సీఐ లలితాదేవి, ఎస్ఐ శివప్రసాద్, సిబ్బంది ఉన్నారు.

ఉగాది సంబరాలు

అనంతపురం విద్య, ఏప్రిల్ 8 : నగరంలోని పలు పాఠశాలల్లో ఉగాది సంబరాలను సోమవారం ఘనంగా నిర్వహించారు. రుద్రంపేటలోని శ్రీచైతన్య స్కూల్‌లో వేడుక సందర్భంగా ఐఎన్‌టీఎస్ఓ పరీక్షల్లో ప్రతిభ చూపిన విద్యార్థులకు డిజిటల్ వాచీలు, ఇతర బహుమతులను ఏజీఎం సుబ్బారెడ్డి అందజేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ శ్రీదేవి, ప్రైమరీ ఇన్‌చార్జ్ సరిత, శబరీన్, ప్రీ ప్రైమరీ ఇన్‌చార్జ్ అమరావతి, ఇతరులు మధుకర్, శివ ప్రసాద్ పాల్గొన్నారు. బస్టాండ్ వద్ద ఉన్న శ్రీచైతన్య స్కూల్‌లో గ్రాడ్యుయేషన్ డే నిర్వహించారు. చిన్నారులకు ఏజీఎం పట్టాలు అందజేశారు.


రుద్రంపేట శ్రీచైతన్య స్కూల్‌లో చిన్నారులకు సర్టిఫికెట్లు ఇస్తున్న ఏజీఎం

కార్యక్రమంలో ప్రిన్సిపాల్ పర్వీన్, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.


మాంటిస్సోరి స్కూల్‌లో...

మాంటిస్సోరి విద్యాసంస్థల్లో ఉగాది పండుగను పురస్కరించుకుని చిన్నారులు సంప్రదాయ వస్త్రధారణలో సందడి చేశారు. పంచాంగ శ్రవణం చేసి ఆకట్టుకున్నారు. కరస్పాండెంట్ సూర్యనారాయణ, కార్యదర్శి, ప్రిన్సిపాళ్లు పాల్గొన్నారు. సాయివిజ్ఞాన్ స్కూల్‌లో నిర్వహించిన వేడుకలో చిన్నారులు సందడి చేశారు. పాఠశాల డైరెక్టర్లు, ప్రధానోపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.


విజయోత్సవాల్లో అధికారులు, ఏజెంట్లు

బీమాతోనే జీవిత భరోసా

ఎల్ఐసీ ఏజెంట్ల సంఘం ప్రధాన కార్యదర్శి జగదీష్

అనంతపురం సెంట్రల్, ఏప్రిల్ 8: సంపాదనలో కొంతమొత్తాన్ని ఎల్ఐసీ బీమాలో పొదుపుచేసిన ప్రతివ్యక్తి జీవితానికి భరోసా లభిస్తోందని ఎల్ఐసీ ఏజెంట్ల సంఘం ప్రధాన కార్యదర్శి చెరుకుతోట జగదీష్ పేర్కొన్నారు. సోమవారం ఎల్ఐసీ బ్రాంచ్-2లో పాలసీల అచీవ్‌మెంట్స్ వేడుకలు నిర్వహించారు. బ్రాంచ్ మేనేజర్ రహీం, ఏబీఎం మమత, సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఆదిశేషయ్య, జగదీష్ ఆధ్వర్యంలో కేక్‌ను కట్‌చేసి సంబరాలు నిర్వహించారు. వారు మాట్లాడుతూ 2023-24 సంవత్సరానికి 5500 పాలసీదారులను చేర్చి సంస్థ లక్ష్యాన్ని చేధించామన్నారు. ఇందులో క్షేత్రస్థాయి ఏజెంట్ల నుంచి కార్యాలయ అధికారులు, సిబ్బంది వరకు ఎనలేని కృషి చేశారని ప్రశంసించారు. ముఖ్యంగా ఎల్ఐసీపై పాలసీదారులకున్న నమ్మకం, వారి మొత్తాలకు భరోసా ప్రధానమైందన్నారు. జీవన్ ఉమంగ్ ద్వారా ఖాతాదారుడు చెల్లిం చిన మొత్తాలు ప్రతి సంవత్సరం తిరిగివస్తుందన్నారు. పాలసీ గడువు అనంతరం జీవి తాంతం ఆర్థిక ప్రయోజనాలు వస్తాయన్నారు. ఇలా జీవన్ ఆనంద్, ఉత్సవ్ తదితర అనేక పథకాలను ఖాతాదారుల సౌలభ్యం కోసం ఎల్ఐసీ సంస్థ అందిస్తోందన్నారు. కార్యక్రమంలో కార్యాలయ అధికారులు హరి, రతన్‌లాల్, మురళి, సూరి, రామకృష్ణ, నాగరాజు, సత్యవతి, జీవనజ్యోతి, ఏజెంట్లు నారాయణ స్వామి, వన్నూర్‌వలి, రామ ముని, లక్ష్మీనారాయణ, సీనా, వేణు, బాషా, రమేష్, నాగేంద్ర, సతీష్‌రెడ్డి, ప్రసాద్ పాల్గొన్నారు.

కూటమి అభ్యర్థుల విజయానికి సహకరిస్తాం: జనసైనికులు


టీసీ వరుణ్‌తో మాట్లాడుతున్న అంబికా లక్ష్మీనారాయణ

అనంతపురం ప్రెస్‌క్లబ్, ఏప్రిల్ 8: జనసేన అధ్యక్షుడు పవన్‌కళ్యాణ్ ఆదేశాల మేరకు జనసేన, టీడీపీ, బీజేపీ కూటమి అభ్యర్థుల విజయానికి అన్ని విధాలుగా సహకరిస్తామని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు టీసీ వరుణ్ స్పష్టం చేశారు. సోమవారం స్థానిక ఆ పార్టీ కార్యాలయంలో కూటమి ఎంపీ అభ్యర్థి అంబికా లక్ష్మీనారాయణ టీసీ వరుణ్‌ను మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించారు. టీసీ వరుణ్ మాట్లాడుతూ.. అనంతపురం పార్లమెంటు వ్యాప్తంగా అన్ని నియోజకవర్గాల్లో కూటమి అభ్యర్థి విజయానికి తమ సహకారం అందిస్తామన్నారు. కార్యక్రమంలో నగర అధ్యక్షుడు పొదిలి బాబురావు, జిల్లా ఉపాధ్యక్షుడు అంకె ఈశ్వరయ్య, జిల్లా ప్రధాన కార్యదర్శులు కుమ్మర నాగేంద్ర, జిల్లా కార్యదర్శులు ఇండ్ల కిరణ్‌కుమార్, సిద్దు, అవుకు విజయకుమార్, ముప్పూరి కృష్ణ, నగర ఉపాధ్యక్షుడు సదానందం, ఏసీఎఫ్ వ్యవస్థాపకుడు నేత్రశీన, నగర ప్రధాన కార్యదర్శి ఇమామ్ హుస్సేన్, నగర కార్యదర్శులు పాల్గొన్నారు.

పలువురు నాయకులకు విజ్ఞప్తి

అనంతపురం అర్బన్: అనంతపురం నగరంలోని పలువురు టీడీపీ నాయకులను అనంతపురం పార్లమెంట్ టీడీపీ ఎంపీ అభ్యర్థి అంబికా లక్ష్మీనారాయణ కలిశారు. సోమవారం నగరంలోని టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీధర్ చౌదరి, గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ గౌస్‌మొద్దీన్‌ను ఆయన మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ ఎన్నికల్లో తన గెలుపునకు సహకరించాలని కోరారు.

ఏ సమస్యయినా 24 గంటల్లో పరిష్కరించాలి: కలెక్టర్


జేఎన్‌టీయూలో ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్

అనంతపురం టౌన్, ఏప్రిల్ 8: ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు సమస్యపై వచ్చిన ఫిర్యాదును 24 గంటలో పరిష్కరించాలని, లేకుంటే తగిన చర్యలు తీసుకుంటామని కలెక్టరు, జిల్లా ఎన్నికల అధికారి డాక్టర్ వినోద్‌కుమార్ అధికారులను హెచ్చరించారు. జిల్లా వ్యాప్తంగా సీజర్స్ యాప్ ద్వారా వచ్చే ఫిర్యాదులపై ప్రత్యేక నిఘా పెట్టాలన్నారు. సోమవారం కలెక్టరేట్‌లో ఎన్నికల నోడల్ అధికారులు, ఆర్‌ఓలు, ఏఆర్‌ఓలతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆర్‌ఓలకు జిల్లా అధికారులు అవసరమైన సహకారం అందించాలని సూచించారు. జిల్లా స్థాయిలో జడ్పీ సీఈఓ, నగరపాలక కమిషనర్, డీఆర్‌ఓ అందుబాటులో ఉంటారని, వారి దృష్టికి సమస్యలు తీసుకువెళ్లి వెంటనే పరిష్కరించుకోవాలని అన్నారు.

జేఎన్‌టీయూలో ఏర్పాట్ల పరిశీలన: జేఎన్‌టీయులో ఏర్పాటు చేస్తున్న కౌంటింగ్ కేంద్రాలు, ఈవీఎంలు భద్రపరిచే స్ట్రాంగ్ రూమ్స్‌లను కలెక్టరు పరిశీలించారు. ఏ ఏ నియోజకవర్గం ఎక్కడ చేపడుతున్నారో అడిగి తెలుసుకున్నారు. ప్రతిచోట విద్యుత్ వసతి, సీసీ కెమెరాలు నిఘా పర్యవేక్షణ ఉండేలా ఏర్పాట్లు చేయాలన్నారు.

వైద్య సిబ్బందికి వ్యాక్సిన్లు

అనంతపురం టౌన్, ఏప్రిల్ 8: ప్రపంచ ఆరోగ్య దినోత్సవాన్ని పురస్కరించుకొని జిల్లా సర్వజన ఆస్పత్రిలో పనిచేస్తున్న సిబ్బందికి హెపటైటీస్ వ్యాక్సిన్ వేశారు. శానిటేషన్‌సిబ్బంది, సెక్యూరిటీ సిబ్బంది, ఎంఎన్‌ఓలు, ఎఫ్ఎన్‌ఓలు దాదాపు 350 మందికి ముందస్తు ఆరోగ్య సంరక్షణలో భాగంగా ఈహెపటైటీస్ వ్యాక్సిన్ వేశారు. కార్యక్రమంలో సూపరింటెండెంట్ వెంకటేశ్వరరావు, ఆర్ఎంఓలు డాక్టర్ పద్మజ, డాక్టర్ హేమలత, డీఐఓ యుగంధర్, సునీత, ఐసీఎన్ శోభా పాల్గొన్నారు.

టీడీపీ కార్యకర్తకు ఆర్థిక సాయం

శింగనమల, ఏప్రిల్ 8: పుట్లూరు మండలం కడవకల్లు గ్రామానికి చెందిన టీడీపీ కార్యకర్త పెద్దయ్య అనారోగ్యంతో అనంతపురంలో ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. సోమవారం ఆయన్ను టీడీపీ రాష్ట్ర ఎస్సీసెల్ అధ్యక్షుడు ఎంఎస్ రాజు పరామర్శించారు. చికిత్స కోసం రూ.10 వేలు ఆర్థిక సాయం అందజేశారు.

ఇఫ్తార్ విందు

అనంతపురం ప్రెస్‌క్లబ్, ఏప్రిల్ 8: స్థానిక అరవిందనగర్‌లోని మసీదులో ముస్లింలకు సోమవారం సాయంత్రం ఉపవాసం అనంతరం సాయి ట్రస్టు అధ్యక్షుడు విజయసాయి కుమార్ ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ట్రస్టు సభ్యులు నారాయణ నాయక్, మురళీధర్, రాఘవేంద్ర పాల్గొన్నారు.

ఎన్నికల్లో నిష్పక్షపాత అధికారులే ఉండాలి: కాంగ్రెస్

అనంతపురం న్యూటౌన్, ఏప్రిల్ 8: ఎన్నికల్లో నిష్పక్షపాతంగా వ్యవహరించే అధికారులనే నియమించాలని పీసీసీ మాజీ అధ్యక్షుడు సాకే శైలజానాథ్ కోరారు. సోమవారం జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ... కాంగ్రెస్ అధికారంలోకి వస్తే.. విభజన చట్టంలో పొందబరిచిన హామీలన్ని అమలు చేస్తామన్నారు. సమావేశంలో జిల్లా అధ్యక్షుడు బండ్లపల్లి ప్రతాప్‌రెడ్డి, ఉపాధ్యక్షులు వాసు, ఇతర నాయకులు పాల్గొన్నారు.

దివ్యాంగులను ఆదుకోవాలి

అనంతపురం విద్య, ఏప్రిల్ 8: దివ్యాంగులకు ప్రభుత్వం కల్పించే అన్ని సదుపాయాలు, పథకాలు వారికి అందేలా చూడాలని సమగ్రశిక్ష ఏపీసీ వరప్రసాద్ అధికారులకు సూచించారు. సోమవారం ఆర్డీటీ స్కూల్‌లో స్కూల్ ప్రధానోపాధ్యాయులు, ఐసీడీఎస్‌కు చెందిన సీడీపీఓలు, సూపర్‌వైజర్లకు నిర్వహించిన శిక్షణ కార్యక్రమం ఆయన మాట్లాడారు. వికలత్వ నిర్ధారణ పరీక్షలు నిర్వహించి, ఉచితంగా ఉపకరణాలు కూడా అందజేస్తారన్నారు. ప్రధానోపాధ్యాయులు ఐసీడీఎస్ అధికారులు వైద్యులతో సమన్వయం చేసుకుని వారికి అవసరమైన సహాయ సహకారాలు అందించాలని సూచించారు. ఐసీడీఎస్ పీడీ శ్రీదేవి మాట్లాడుతూ... శిశువులు ఆరోగ్యంగా జన్మిస్తే... వికలాంగ సమస్యలు చాలా వరకూ తక్కువగా ఉంటాయన్నారు. మాతాశిశు సంక్షేమంపై చిత్తశుద్ధితో పనిచేయాలని సూచించారు. కార్యక్రమంలో డిప్యూటీ డీఈఓ శ్రీనివాస్, సమగ్రశిక్ష అధికారులు షమ, గోపాలకృష్ణ పాల్గొన్నారు.

మద్యం స్వాధీనం

అనంతపురం క్రైం, ఏప్రిల్ 8: స్థానిక భవాని సర్కిల్ వద్ద ఎన్టీఆర్ మార్గ్ వద్ద అక్రమంగా మద్యం తీసుకువెళ్తున్న వ్యక్తిని పోలీసులు సోమవారం అరెస్టు చేశారు. నిందితుడ్ని బుక్కరాయసముద్రం మండలం దయ్యాలకుంటపల్లి గ్రామానికి చెందిన వ్యక్తిగా గుర్తించారు. అతని వద్ద నుంచి రూ. 4,640 విలువ గల కింగ్స్‌వెల్, క్లాసిక్ రెడ్ బ్రాంది, హైదరాబాద్ హౌస్ బాటిళ్ల స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

చీనీకాయలు టన్ను రూ.35 వేలు

అనంతపురంరూరల్: అనంతపురం వ్యవసాయ మార్కెట్‌లో సోమవారం చీనీకాయలు టన్ను గరిష్ఠంగా రూ.35 వేలు, కనిష్ఠంగా రూ.12,500, సరాసరి రూ.21 వేలతో అమ్ముడుపోయినట్లు మార్కెట్ ఎంపిక శ్రేణి కార్యదర్శి జయలక్ష్మి తెలిపారు. మార్కెట్‌కు మొత్తంగా 707 టన్నుల చీనీకాయలు వచ్చాయన్నారు.

వలంటీర్లా.. వైసీపీ కార్యకర్తలా..?



ఫొటోలో కనిపిస్తున్న మహిళలంతా నార్పల వలంటీర్లే...

నార్పల, ఏప్రిల్ 8: ఎన్నికల నిబంధలను ఉల్లంఘిస్తూ తమనెవరూ అడ్డుకోలేరంటూ కొందరు మహిళా వలంటీర్లు వైసీపీ కార్యకర్తల్లా వ్యవహరిస్తున్నారు. మండల కేంద్రంలో వైసీపీ నాయకుడు సత్యనారాయణరెడ్డి తన స్వగృహం వద్ద వైసీపీ కార్యకర్తల సమావేశం నిర్వహించారు. సమావేశానికి నార్పలకు చెందిన కొందరు మహిళా వలంటీర్లు హాజరయ్యారు. ఈ ఫొటోలో కనిపిస్తున్న వారంతా మహిళా వలంటీర్లు కావడం గమనార్హం. వీరు కాకుండా మరికొందరు వలంటీర్ల కూడా హాజరైనట్లు తెలిసింది. సమావేశంలో వైసీపీ అభ్యర్థి వీరాంజనేయులును గెలపించేలా వలంటీర్లు కృషి చేయాలని ఆదేశాలు ఇచ్చారు. ఎన్నికల నిబంధనలను తుంగలో తొక్కి వలంటీర్లు హాజరవ్వడం సర్వత్రా చర్చనీయాంశంగా మారింది.

పనిచేయించుకుని జీతాలు ఎగ్గొట్టారు

- ఎస్పీకి యోగా టీచర్ల ఫిర్యాదు



ఎస్పీ మాధవరెడ్డికి ఫిర్యాదు చేస్తున్న యోగా టీచర్లు

పుట్టపర్తి రూరల్, ఏప్రిల్ 8: యోగా టీచర్ ఉద్యోగం పేరుతో పని చేయించుకుని జీతాలు ఇవ్వకుండా మోసం చేశారని, తమకు న్యాయం చేయాలంటూ జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్పీ మాధవరెడ్డికి యోగాటీచర్లు ఫిర్యాదు చేశారు. స్థానిక జిల్లాపోలీసు కార్యాలయంలో ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి కుళ్లాయప్ప, యోగా టీచర్లు సతీష్, శివకుమారి, లలిత, హరినాయక్ సోమవారం ఎస్పీని కలిశారు. వారు మాట్లాడుతూ.. గుంటూరుకు చెందిన బుద్ధా ఫౌండేషన్ యోగా సెంటర్లను జిల్లాలో ఏర్పాటు చేసిందన్నారు. యోగా టీచర్లుగా తమ సేవలను 15 నెలలు ఉపయోగించుకుని ఆ సంస్థ చైర్మన్ తమకు రావాల్సిన రూ.15 లక్షల జీతాలు ఇవ్వకుండా మోసం చేశారన్నారు. తమకు న్యాయం చేయాలని ఎస్పీని కోరారు. తాము ఆ సంస్థలో 15 నెలలపాటు ఉద్యోగం చేశామన్నారు. తమకు రావాల్సిన జీతాలు ఇవ్వకుండా సంస్థ మోసం చేసిందన్నారు. దీనిపై ఎస్పీ స్పందిస్తూ విచారించి న్యాయం చేసే విధంగా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

హుబ్లీ, విజయవాడ మధ్య ఉగాది ప్రత్యేక రైలు

గుంతకల్లు, ఏప్రిల్ 8: ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకుని రైళ్లలో ప్రయాణికుల రద్దీ నిరయంత్రణ కోసం హుబ్లీ-విజయవాడ-హుబ్లీ మధ్య (వయా గుంతకల్లు, బళ్లారి) ఓ ప్రత్యేక రైలును నడపనున్నట్లు రైల్వే అధికారులు సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. విజయవాడ-హుబ్లీ (నెం.07001) ప్రత్యేక రైలు ఈ నెల 10వ తేదీన విజయవాడలో మధ్యాహ్నం రెండున్నరకు బయలుదేరి మరుసటి రోజు ఉదయం 7-10 గంటలకు హుబ్లీకి చేరుకుంటుందన్నారు. దీని తిరుగు ప్రయాణపు రైలు (నెం.07002) ఈనెల 11వ తేదీన హుబ్లీలో ఉదయం 9-25 గంటలకు బయలుదేరి మరుసటి రోజు తెల్లవారుజామున 1 గంటకు విజయవాడకు చేరుతుందన్నారు. ఈ రైలు గుంటూరు, నరసరావుపేట, వినుకొండ, దొణకొండ, మార్కాపురం రోడ్డు, గిద్దలూరు, నంద్యాల, డోన్, గుంతకల్లు, బళ్లారి, తోరణగల్లు, హోసపేట, మునీరాబాద్, కొప్పళ, గదగ్, అనిగిరి స్టేషన్ల మీదుగా వెళ్తుందన్నారు.

ఆధారాలు లేని నగదు స్వాధీనం

ధర్మవరం, ఏప్రిల్ 8: ఎటువంటి ఆధారాలు లేకుండా తరలిస్తున్న రూ.1,78,020 నగదును స్వాధీనం చేసుకున్నట్లు వన్‌టౌన్ సీఐ సుబ్రహ్మణ్యం, ఫ్లయింగ్‌స్క్వాడ్ అధికారి కృష్ణారావు సోమవారం తెలిపారు. పట్టణంలోని ఎర్రగుంట్ల సర్కిల్లో ఆదివారం తాము సిబ్బందితో కలిసి వాహనాల తనిఖీ చేపట్టామని అన్నారు. పుట్లూరు మండలం కొండాపురానికి చెందిన అశోక్‌నాయుడిని తనిఖీ చేయగా రూ.1,78,020 నగదు లభ్యమైందని తెలిపారు. నగదు ఎక్కడిదో ఆధారాలు చూపలేదని, దీంతో స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. ఎన్నికల నిబంధనల మేరకు ఎలాంటి ఆధారాలు లేకుండా పెద్ద మొత్తంలో నగదును ఎవరూ తరలించరాదని సూచించారు. నగదు తీసుకువెళ్లేవారు అందుకు సంబంధించిన ఆధారాలను వెంట తీసుకుని రావాలని సూచించారు.

జీవిత ఖైదు

తాడిపత్రిటౌన్, ఏప్రిల్8: పట్టణంలోని నందలపాడుకు చెందిన కాసి పోగుల వెంకటేశ్వర్లుకు అనంతపురం కోర్టు జీవిత ఖైదుతోపాటు రూ.2500 జరిమానా విధించినట్లు సోమవారం పోలీసులు తెలిపారు. నందలపాడులో నివాసం ఉంటున్న కాసిపోగుల వెంకటేశ్వర్లు మద్యం మత్తులో 2020 జూలై 4న ఓ బాలికపై అత్యాచారం చేశాడని కేసు నమోదైంది. ఈ కేసును విచారించిన కోర్టు, నేరం రుజువు కావడంతో ముద్దాయికి జీవితఖైదు విధించిందని పోలీసులు తెలిపారు.

సెట్ చేసుకోవాల్సిందే

ఉన్నత విద్యా కోర్సులు అభ్యసించాలంటే కామన్ ఎంట్రెన్స్ టెస్ట్(సెట్) రాయాల్సిందే. ఇందులో అర్హత సాధించిన విద్యార్థులు ప్రవేశాలకు అర్హులు. సెట్ నిర్వహణ ప్రక్రియను రాష్ట్ర ఉన్నత విద్యామండలి వివిధ యూనివర్సిటీలకు అప్పగించింది. ఒక్కో యూనివర్సిటీ ఒక్కో సెట్‌ను నిర్వహిస్తోంది. అయితే ఏ సెట్ ఎవరు నిర్వహిస్తున్నారు, దరఖాస్తులకు అర్హులెవరు, పరీక్షలెప్పుడు వంటి అంశాలను రాష్ట్ర ప్రభుత్వం ప్రకటనతో సరిపెట్టింది. మరోవైపు ప్రైవేట్ కోచింగ్ సెంటర్ల నిర్వాహకులు సెట్‌లకు లాంగ్ టర్మ్, షార్ట్ టర్మ్ కోచింగ్ పేరుతో దోపిడీకి తెరలేపారని ఇటు విదార్థుల తల్లిదండ్రులు, అటు విద్యార్థి సంఘాలు ప్రభుత్వంపై మండిపడుతున్నాయి. తరగతులు నిర్వహిస్తున్న సమయంలోనే సంబంధిత విద్యార్థులు పైకోర్సులకు ఎలా వెళ్లాలి? ఏఏ సెట్‌లు రాయాలన్న అవగాహన కల్పించడంలేదని వాపోతున్నాయి. ప్రతి ఏటా గందగోళానికి గురికావాల్సి వస్తోందని పేర్కొంటున్నాయి. విద్యార్థులు వారి ఉన్నత విద్యను కొనసాగించేందుకు ఏఏ సెట్‌లు రాయాలో వివరాలు మీకోసం...

- అనంతపురం సెంట్రల్



- డిగ్రీ నుంచి పీహెచ్‌డీ వరకు కామన్ ఎంట్రెన్స్
- ఏ కోర్సులో చేరాలన్నా.. సెట్‌లో అర్హత సాధించాలి
- ప్రారంభమైన దరఖాస్తుల స్వీకరణ

పీజీఈసెట్..



బీటెక్, బీఫార్మసీ, బీఆర్క్, ఎంబీబీఎస్, బీడీఎస్, బీఎంసీఏ వంటి డిగ్రీ కోర్సులు అభ్యసించిన విద్యార్థులు పోస్ట్ గ్రాడ్యుయేషన్(పీజీ)లో చేరడానికి పోస్ట్ గ్రాడ్యుయేషన్ ఇంజనీరింగ్ కామన్ ఎంట్రెన్స్ టెస్ట్(పీజీఈసెట్) పరీక్షల్లో అర్హత సాధించాలి. దీనిని వెంకటేశ్వర యూనివర్సిటీ తిరుపతి నిర్వహిస్తోంది. చైర్మన్‌గా వీసీ శ్రీకాంత్‌రెడ్డి, కన్వీనర్‌గా ప్రొఫెసర్ రామశ్రీ, కో-కన్వీనర్‌గా దివాకర్‌రెడ్డి వ్యవహరిస్తున్నారు. పరీక్షలు రాయడానికి 20 వరకు దరఖాస్తు చేసుకోవచ్చు. ఆలస్యమైన వారు మే 12వరకు ఫైన్‌తో దరఖాస్తుచేసుకోవాలి. దరఖాస్తుల్లో తప్పిదాలను 14 వరకు సరిచేసుకునే అవకాశముంది. అభ్యర్థులు వారి హాల్‌టికెట్స్‌ను 22నుంచి డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. 29 నుంచి 31వరకు పరీక్షలు నిర్వహించనున్నారు. వివరాలకు 7382058455 లేదా helpdeskappgecet@apsche.orgకు మెయిల్ చేయాలి.

ఈఏపీసెట్...



బీటెక్‌లో ఇంజనీరింగ్, అగ్రికల్చర్‌తోపాటు బీఫార్మసీ ప్రవేశాలకు ఇంజనీరింగ్, అగ్రికల్చర్, ఫార్మసీ(ఈఏపీ)సెట్ నిర్వహిస్తున్నారు. ఇంటర్మీడియేట్‌లో ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులు ఈఏపీసెట్‌కు దరఖాస్తు చేసుకోవడానికి అర్హులు. జేఎన్‌టీయూ కాకినాడ సెట్‌ను నిర్వహిస్తోంది. చైర్మన్‌గా వీసీ ప్రసాద్‌రాజు, కన్వీనర్‌గా ప్రొఫెసర్ వెంకటరెడ్డి, కో-కన్వీనర్లుగా ప్రొఫెసర్ మోహన్‌రావు, ప్రొఫెసర్ నాగేశ్వరరావు వ్యవహరిస్తున్నారు. అర్హతగల విద్యార్థుల నుంచి ఏప్రిల్ 15 వరకు దరఖాస్తులు స్వీకరిస్తున్నారు. దరఖాస్తులో ఏవైనా తప్పిదాలుంటే మే 6వరకు కరెక్షన్ చేసుకోవచ్చు. మే 12 వరకు ఫైన్‌తో దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. దరఖాస్తు చేసుకున్నవారు మే 7 నుంచి ఆన్‌లైన్‌లో వారి హాల్‌టికెట్స్‌ను డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. 16, 17న అగ్రికల్చర్, ఫార్మసీ. 18 నుంచి 22వరకు ఇంజనీరింగ్ స్ట్రీమింగ్ పరీక్షలు నిర్వహిస్తారు. వివరాలకు 0884-2359599, 2342499 నెంబర్లకు ఫోన్‌చేయాలి. helpdeskapeapcet@apsche.org వెబ్‌సైట్‌ను సంప్రదించాలి.

ఈసెట్...



డిప్లమో కోర్సులు పూర్తిచేసిన వారికి బీటెక్, బీఫార్మసి, అగ్రికల్చర్ కోర్సుల్లో ద్వితీయ సంవత్సరం ప్రవేశాలను కల్పించేందుకు ఇంజనీరింగ్ కామన్ ఎంట్రెన్స్ టెస్ట్(ఈసెట్)ను జేఎన్‌టీయూ అనంతపురం నిర్వహిస్తోంది. చైర్మన్‌గా వీసీ శ్రీనివాసరావు, కన్వీనర్‌గా ప్రొఫెసర్ భానుమూర్తి, కో-కన్వీనర్‌లుగా ప్రొఫెసర్ దుర్గాప్రసాద్, ప్రొఫెసర్ దిలీప్‌కుమార్ వ్యవహరిస్తున్నారు. అర్హతగల విద్యార్థులు 15 వరకు దరఖాస్తుచేసుకోవాలి. 25 నుంచి 27వరకు దరఖాస్తుల్లో తప్పిదాలను సరిచేసుకోవచ్చు. ఫైన్‌తో మే 2 వరకు దరఖాస్తులు స్వీకరిస్తారు. మే 1 నుంచి ఆన్‌లైన్ ద్వారా హాల్‌టికెట్స్‌ను డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. మే 8న పరీక్షలు నిర్వహించి 10న ప్రిలిమినరీ కీ విడుదల చేయనున్నారు. వీటిపై అభ్యంతరాలుంటే 12 వరకు ఫిర్యాదు చేయవచ్చు. వివరాలకు 08554232622 లేదా helpdeskapecet@apsche.org కు మెయిల్ చేయాలి.

లాసెట్...



మూడు, ఐదు సంవత్సరాల ఎల్‌ఎల్‌బీ కోర్సులు. రెండు సంవత్సరాల ఎల్‌ఎల్‌ఎం కోర్సుల ప్రవేశాలకు గుంటూరులోని ఆచార్య నాగార్జున యూనివర్సిటీ లా, పీజీఎల్ సెట్‌ను నిర్వహిస్తోంది. చైర్మన్‌గా వీసీ రాజశేఖర్, కన్వీనర్‌గా ప్రొఫెసర్ సత్యనారాయణ వ్యవహరిస్తున్నారు. అర్హులైన అభ్యర్థుల నుంచి 25 వరకు దరఖాస్తులు స్వీకరిస్తున్నారు. ఫైన్‌తో మే 29వరకు దరఖాస్తుచేసుకోవచ్చు. వాటిలోని తప్పిదాలను 30 నుంచి జూన్ 1 వరకు సరిదిద్దుకునే అవకాశాన్ని కల్పించారు. 9న నిర్వహించనున్న పరీక్షలకు 3 నుంచే హాల్‌టికెట్స్‌ను డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. 10న ప్రిలిమినరీ కీ విడుదలచేసి 12వరకు అభ్యంతరాలను స్వీకరించనున్నారు. వివరాలకు 7993788813, 08632346171 లేదా helpdeskaplawcet@apsche.orgకు మెయిల్ చేయాలి.

పీజీసెట్...



బీఏ, బీకామ్, బీఎస్సీ తదితర డిగ్రీ పూర్తిచేసిన విద్యార్థులు ఎంఏ, ఎంకామ్, ఎమ్మెస్సీ వంటి పీజీ కోర్సుల్లో ప్రవేశాలను కల్పించేందుకు విశాఖలోని ఆంధ్రయూనివర్సిటీ.. పీజీసెట్‌ను నిర్వహిస్తోంది. చైర్మన్‌గా వీసీ ప్రసాద్‌రెడ్డి, కన్వీనర్‌గా ప్రొఫెసర్ శశిభూషణ్ రావు వ్యవహరిస్తున్నారు. ఇందుకు మే 4వరకు దరఖాస్తులు చేసుకోవచ్చు. 25 వరకు ఫైన్‌తో దరఖాస్తులు స్వీకరిస్తారు. దరఖాస్తులో తప్పిదాలను 30 వరకు సరిచేసుకునే అవకాశాన్ని కల్పించారు. 31 నుంచి హాల్‌టికెట్స్‌ను డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. జూన్ 10నుంచి 14వరకు పరీక్షలు నిర్వహించనున్నారు. పరీక్షలు అనంతరం రెండు రోజులకు ప్రిలిమినరీ కీ విడుదల చేస్తారు. వాటిలోని అభ్యంతరాలను మరో రెండు రోజులవరకు స్వీకరిస్తారు. వివరాలకు 0891 2531455 లేదా https://cets.apsche.ap.gov.in వెబ్‌సైట్‌ను సందర్శించాలి.

ఐసెట్...




ఎంసీఏ, ఎంబీఏ ప్రవేశాలకోసం అనంతపురం ఎస్కేయూ.. ఇంటిగ్రేటెడ్ కామన్ ఎంట్రెన్స్ టెస్ట్(ఐసెట్)ను నిర్వహిస్తోంది. చైర్మన్‌గా వీసీ హుస్సేన్‌రెడ్డి, కన్వీనర్‌గా ప్రొఫెసర్ మురళీకృష్ణ వ్యవహరిస్తున్నారు. దరఖాస్తుల స్వీకరణ 7న ముగిసింది. అయితే 27వరకు ఫైన్‌తో దరఖాస్తు స్వీకరిస్తున్నారు. మే 2నుంచి హాల్‌టికెట్స్‌ను డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. 6, 7న పరీక్షలు జరగనున్నాయి. 8న ప్రిలిమినరీ కీ విడుదలచేసి 10 వరకు అభ్యంతరాలను స్వీరించనున్నారు. జూన్ 20న ఫలితాలు విడుదల చేయనున్నారు. వివరాలకు 9000977657 లేదా https://cets.apsche.ap.gov.in/ICET/ వెబ్‌సైట్‌ను సందర్శించాలి.

పీఈసెట్..



వ్యాయామ విద్యలో రెండు సంవత్సరాల బీపీఈడీ, డీపీఈడీ కోర్సుల ప్రవేశాలను కల్పించేందుకు ఆచార్య నాగార్జున యూనివర్సిటీ(ఏఎన్‌యూ) ఆధ్వర్యంలో ఫిజికల్ ఎడ్యుకేషన్ ఎంట్రెన్స్ టెస్ట్(పీఈసెట్)ను నిర్వహిస్తున్నారు. చైర్మన్‌గా వీసీ రాజశేఖర్, కన్వీనర్‌గా ప్రొఫెసర్ జాన్సన్ వ్యవహరిస్తున్నారు. అర్హులైన విద్యార్థులనుంచి మే 15 వరకు దరఖాస్తులు స్వీకరిస్తున్నారు. 29 వరకు ఫైన్‌తో దరఖాస్తు చేసుకోవచ్చు. జూన్ 4 నుంచి హాల్ టికెట్స్‌ను డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. 11న ఏఎన్‌యూ క్యాంపస్‌లో శారీరక సామర్థ్యం, ఆటల నైపుణ్య పరీక్ష నిర్వహిస్తారు. వివరాలకు 0863-2346218 లేదాhttps://cets.apsche.ap.gov.in/PECETవెబ్‌సైట్‌నుసందర్శించాలి.

ఆర్‌సెట్...



పీజీ కోర్సులు పూర్తిచేసి సంబంధిత కోర్సుల సబ్జెక్టుల్లో ప్రత్యేక పరిశోధనలు చేయడానికి తిరుపతిలోని వెంకటేశ్వర యూనివర్సిటీ ఆధ్వర్యంలో రీసర్చ్ కామన్ ఎంట్రన్స్ టెస్ట్(ఆర్‌సెట్) నిర్వహిస్తున్నారు. చైర్మన్‌గా రాష్ట్ర ఉన్నత విద్యామండలి చైర్మన్ ప్రొఫెసర్ హేమచంద్రారెడ్డి, వీసీ శ్రీకాంత్ రెడ్డి, కన్వీనర్‌గా ప్రొఫెసర్ దేవ ప్రసాద్ రాజు వ్యవహరిస్తున్నారు. ఫుల్‌టైమ్, పార్ట్‌టైమ్ ప్రాతిపదికన 68 సబ్జెక్టుల్లో అడ్మిషన్ పొందడానికి అర్హులైన అభ్యర్థుల నుంచి 7వరకు దరఖాస్తులు స్వీకరించారు. 10 నుంచి హాల్‌టికెట్స్‌ను డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. మే 2 నుంచి 5వరకు పరీక్షలు(తాత్కాలిక) పరీక్షలు నిర్వహిస్తారు. 8న ప్రిలిమినరీ కీ విడుదలచేసి 10వరకు అభ్యంతరాలు స్వీకరించనున్నారు. అర్హత సాధించిన అభ్యర్థుల ఇంటర్వ్యూ 20న ప్రకటిస్తారు. వివరాలకు 9030407022 లేదా https://cets.apsche.ap.gov.in/RCET/ వెబ్‌సైట్‌ను సంప్రదించాలి.

మైనర్.. ఓటర్..!

- 18 ఏళ్లు నిండకనే ఓటు హక్కు
- కృష్ణంరెడ్డిపల్లి జాబితాలో బాలలు
- అధికార పార్టీవారిపై టీడీపీ అనుమానం

అనంతపురం రూరల్, ఏప్రిల్ 8: ఓటరు జాబితాలో అక్రమాలు ఇంకా బయటపడుతూనే ఉన్నాయి. అనంతపురం రూరల్ మండలంలోని క్రిష్ణంరెడ్డిపల్లిలో మైనర్లకు ఓటు హక్కు కల్పించారు. 16 ఏళ్లు, 17 ఏళ్ల వయసున్నవారి పేర్లను ఓటరు జాబితాలో చేర్చారు. ఈ అక్రమాల గురించి విపక్ష నాయకులు బీఎల్వోలను ప్రశ్నిస్తే.. తమకేమీ తెలియదని అంటున్నారు. ఎన్నికల అధికారులకు ఫిర్యాదు చేయాలని సలహా ఇస్తున్నారు. ఓటరు నమోదులో బీఎల్వోలే కీలకం. దరఖాస్తులను వీరు పక్కాగా పరిశీలించాలి. క్షేత్రస్థాయిలో విచారించి, వయసు 18 ఏళ్లు, ఆపై ఉన్నట్లు నిర్ధారించుకోవాలి. ఆ తరువాత ఓటరు జాబితాలో చేర్చాలని సిఫార్సు చేయాల్సి ఉంటుంది. ఈ ప్రక్రియ పూర్తి అయితేనే ఓటరు జాబితాలో పేరు చేరుతుంది. జిల్లాలో ఓటరు జాబితా అక్రమాలు ఇదివరకే చాలా బయట పడ్డాయి. బాధ్యులపై పలువురు అధికారులపై ఎన్నికల కమిషన్ చర్యలు తీసుకుంది. ఓటరు జాబితా ఇంటింటి పరిశీలన చేయించి.. సరిచేయించింది. అయినా తప్పులు కొనసాగడం విమర్శలకు తావిస్తోంది. గ్రామంలో తమకు తెలియకుండానే ఓటరు జాబితాలో మైనర్ల పేర్లు చేరాయని బీఎల్వోలు చెబుతుండటం అనుమానాలకు తావిస్తోంది. అధికార పార్టీ నాయకులు పైస్థాయి అధికారులతో మాట్లాడి, నేరుగా ఓటరు జాబితాలో పేర్లను చేర్పించి ఉంటారని కొందరు అంటున్నారు.



మురళి మార్కుల జాబితా, ఓటరు జాబితాలో నమోదైన ఎన్‌డీఎఫ్ నంబరు

17 ఏళ్లకే ఓటు హక్కు

అనంతపురం రూరల్ మండలం క్రిష్ణంరెడ్డిపల్లిలో ఓటరు జాబితాలో జి.వైష్ణవి పేరు నమోదైంది. పదో తరగతి మార్కుల జాబితా ప్రకారం వైష్ణవి 2007, ఏప్రిల్ 30వ తేదీ జన్మించింది. ఆధార్ కార్డులో ఇదే ఏడాది జనవరి 1న పుట్టినట్లు నమోదైంది. ఈ రెండు తేదీల ప్రకారం కూడా తన వయసు 17 ఏళ్లు మాత్రమే. అయినా వైష్ణవి పేరును ఎన్‌డీఎఫ్ 2398592 నంబరు కింద ఓటరుగా నమోదు చేశారు. ఇదే గ్రామానికి చెందిన జి.చరణ్ పుట్టిన తేదీ.. ఆధార్ కార్డు ప్రకారం 01-01-2006. పదో తరగతి మార్కుల జాబితాలో పుట్టిన తేదీ 22-05-2007 అని చూపించారు. సాధారణంగా పదో తరగతి మార్కుల జాబితాలో పుట్టిన తేదీ ప్రామాణికంగా తీసుకుంటారు. ఆధార్ నమోదు సమయంలో పుట్టిన తేదీలను ఇష్టారాజ్యంగా నమోదు చేయడమే దీనికి కారణం. అయిన 18 ఏళ్లు నిండకనే చరణ్‌కు ఓటు హక్కు కల్పించారు.



వైష్ణవి పది మార్కుల జాబితా, ఓటరు జాబితాలో నమోదైన ఎన్‌డీఎఫ్ నంబరు

ఎన్‌డీఎఫ్ 2398568 నంబరు కింద ఓటరు జాబితాలో చేర్చారు. ఇదే గ్రామానికి చెందిన జి.మురళి పుట్టిన తేదీ.. పదో తరగతి మార్కుల జాబితా ప్రకారం 17-02-2007. అయినా ఓటరు జాబితాలో చేర్చారు. ఎన్‌డీఎఫ్ 2398584 నంబరు కింద ఓటరు కార్డు జారీ చేశారు.

గతంలోనే ఫిర్యాదు..

ఓటరు జాబితాలో అక్రమాలపై ప్రతిపక్ష నాయకులు గతంలోనే మండల అధికారులకు ఫిర్యాదులు చేశారు. రాప్తాడు మండలంలోని చిన్మయనగర్‌లో ఆధార్ కార్డులను మార్చి.. నకిలీ ఓటర్లను జాబితాలో చేర్పించారని, రూరల్ మండలంలో కూడా ఇలాంటివే జరిగాయని, విచారించి చర్యలు తీసుకోవాలని టీడీపీ నాయకులు మండల అధికారులకు వినతిపత్రాలు ఇచ్చారు. అధికార పార్టీ నాయకులే ఇలాంటి అక్రమాలకు పాల్పడుతన్నారని ఫిర్యాదు చేశారు. అధికారులు తమ ఫిర్యాదులను చెత్త బుట్టలోకి వేశారని, అందుకే మైనర్ల పేర్లు ఓటరు జాబితాలో కనిపిస్తున్నాయని టీడీపీ నాయకులు అంటున్నారు.

మా దృష్టికి రాలేదు..

ఓటరు జాబితాలో మైనర్ల పేర్లు ఉన్న విషయం మా దృష్టికి రాలేదు. వయసు తక్కువగా ఉన్నవారికి ఓటు హక్కు ఉండదు. అలాంటివారి దరఖాస్తులను పరిగణనలోకి తీసుకోం.

- పుల్లయ్య, ఏఈఆర్వో

అంగన్‌వాడీలకు జగనన్న మోసాలు..!

- ఐదేళ్ల పాలనలో రూ.వెయ్యి మాత్రమే వేతనం పెంపు
- అమలుకాని సీఎం హామీలు
- తెలంగాణ కన్నా ఎక్కువగా వేతనాలు ఉత్తమాటే..
- ఇతర డిమాండ్లపై దాటవేత
- సమ్మె కాలానికి జీతం చెల్లించని ప్రభుత్వం

ధర్మవరం, ఏప్రిల్ 8: అంగన్‌వాడీలకు సీఎం జగన్ మోసాలు చేశారంటూ ఆ వర్గాలు ఆవేదన వ్యక్తం చేస్తున్నాయి. 2019 ఎన్నికలకు ముందు ప్రతిపక్ష నేతగా జగన్ ఇచ్చిన హామీలు అమలు చేయలేదు. అధికారంలోకి వచ్చాక ఎన్నో హామీలు గుప్పించి.. వాటినీ అటకెక్కించాడు. డిమాండ్ల సాధన దిశగా అంగన్‌వాడీలు నిరవధిక సమ్మె చేపట్టారు. 42 రోజులపాటు ఉధృతంగా కొనసాగించారు. అప్పుడు కూడా ప్రభుత్వ పెద్దలు పలు డిమాండ్లకు అంగీకరించారు. వాటిని కూడా విస్మరించారు. ఇలా.. అంగన్‌వాడీలను జగనన్న అన్ని రకాలుగా మోసగించాడని ఆ వర్గాలు మండిపడుతున్నాయి. ప్రతిపక్ష నేతగా జగన్ ఇచ్చిన హామీలను అధికారంలోకి వచ్చాక మరచిపోయాడు. తెలంగాణలోని అంగన్‌వాడీ సిబ్బంది కంటే ఎక్కువ వేతనం చెల్లిస్తామనీ, ఇతర సమస్యలను కూడా పరిష్కరిస్తామని పాదయాత్ర సమయంలో ఊరూరా హామీ ఇచ్చాడు. అధికారంలోకి వచ్చాక వాటిని విస్మరించాడు. ఐదేళ్లలో ఒకే ఒకసారి రూ.వెయ్యి వేతనం పెంచాడు. తెలంగాణ కంటే ఎక్కువ ఇస్తామన్న హామీని మాత్రం నెరవేర్చలేకపోయాడు.



ధర్మవరంలో సమ్మె చేస్తున్న అంగన్‌వాడీలు (ఫైల్)

ఎన్నికల వేళ ఇచ్చిన హామీ

గత సార్వత్రిక ఎన్నికలకు ముందు రాష్ట్రంలో పాదయాత్ర చేసిన జగన్ అంగన్‌వాడీ సిబ్బందికి పలు హామీలిచ్చారు. ఏళ్ల తరబడి పనిచేస్తున్న అంగన్‌వాడీ సిబ్బందికి అండగా ఉంటాననీ, సమస్యలను పరిష్కరించడంతోపాటు తెలంగాణలో కంటే రూ.వెయ్యి వేతనం అదనంగా చెల్లిస్తానని హామీ ఇచ్చారు. అధికారంలోకి వచ్చిన తరువాత హామీలను అమలు చేయడంలో పూర్తిగా నిర్లక్ష్యం ప్రదర్శించారు. జగన్ అధికారంలోకి రావడానికి ముందు అంగన్‌వాడీ కార్యకర్తలకు నెలకు రూ.10,500, ఆయాకు రూ.6వేలు వేతనంగా చెల్లించేవారు. అధికారంలోకి వచ్చాక ఐదేళ్లలో ఒకసారి మాత్రం రూ.వెయ్యి వేతనం పెంచారు. తెలంగాణ ప్రభుత్వం పీఆర్‌సీని అమలు చేయడంతో అక్కడి అంగన్‌వాడీ సిబ్బందికి వేతనాలు పెరిగాయి. ప్రస్తుతం తెలంగాణలో అంగన్‌వాడీ కార్యకర్తకు రూ.13,500, ఆయాకు రూ.9వేలు చొప్పున చెల్లిస్తున్నారు. ఏపీలో కార్యకర్తకు రూ.11,500, ఆయాకు రూ.7వేలు మాత్రమే ఇస్తున్నారు. జగన్ ఇచ్చిన హామీ మేరకు తెలంగాణ కంటే రూ.వెయ్యి అధికంగా వేతనం ఇవ్వాలంటే కార్యకర్తకు రూ.14,500, ఆయాకు రూ.10వేలు చెల్లించాలి. ఆ దిశగా ప్రభుత్వం చర్యలు చేపట్టిన పాపానపోలేదు.

ప్రభుత్వం పట్టించుకోవట్లేదు



అంగన్‌వాడీలకు వేతనం తెలంగాణ కంటే రూ.వెయ్యి అదనంగా ఇస్తామని సీఎం జగన్ హామీ ఇచ్చారు. దీనిపై పలుమార్లు అడిగినా ప్రభుత్వం స్పందించలేదు. ఇతర సమస్యలను పట్టించుకోలేదు. అందుకే అంగన్‌వాడీలు నిరవధిక సమ్మెకు దిగారు. అప్పట్లో అంగన్‌వాడీలకు ప్రభుత్వం ఇచ్చిన హామీలను నేటికీ అమలు చేయలేదు. సమ్మె కాలానికి జీతం చెల్లించలేదు. ఇతర హామీలకు సంబంధించిన జీఓలు విడుదల చేయలేదు. అంగన్‌వాడీలకు న్యాయం చేయాలి.

- శ్రీదేవి, అంగన్‌వాడీ వర్కర్ల యూనియన్ జిల్లా నేత

ఇతర సమస్యలూ అంతే..

అంగన్‌వాడీలకు సంబంధించి ఏళ్ల తరబడి ఉన్న సమస్యలను కూడా పరిష్కరిస్తానని జగన్ హామీ ఇచ్చారు. రిటైర్మెంట్ వయసు 62 ఏళ్లకు పెంచాలనీ, రిటైర్మెంట్ బెనిఫిట్స్ పెంచాలనీ, మినీ సెంటర్లను మెయిన్ సెంటర్లుగా మార్చాలనీ, పనిభారం తగ్గించాలని అంగన్‌వాడీ సిబ్బంది కోరుతున్నారు. అధికారంలోకి వచ్చాక జగన్.. వాటిలో ఏ ఒక్కటీ నెరవేర్చకపోవడంతో గతే ఏడాది డిసెంబరులో నిరవధిక సమ్మెలోకి వెళ్లారు. 42 రోజులపాటు కొనసాగించారు. ఎన్నికలకు ముందు అంగన్‌వాడీ సిబ్బంది చేస్తున్న సమ్మెతో ఇబ్బందులు తప్పవని భావించిన ప్రభుత్వం.. సంఘం నాయకులతో చర్చలు సాగించింది. పలు డిమాండ్లను అమలు చేయడానికి అంగీకరించింది. వీటిలో రిటైర్మెంట్ వయసు 62 ఏళ్లకు పెంచుతూ మాత్రమే జీఓ విడుదల చేసింది. మిగిలిన డిమాండ్లకు సంబంధించి జీఓలను విడుదల చేయలేదు. సమ్మె కాలానికి సంబంధించి పూర్తి వేతనం చెల్లిస్తామని హామీ ఇచ్చింది. అది కూడా ఇప్పటి వరకు విడుదల చేయలేదు. ఈ సమస్యలను పరిష్కరించేందుకు ప్రత్యేకంగా కమిటీ ఏర్పాటు చేస్తామని పాలకులు చెప్పారు. ఇప్పటికీ ఆ దిశగా చర్యలు చేపట్టిన దాఖలాల్లేవు. సమ్మె సమయంలో అన్నింటినీ పరిష్కరిస్తామని చెప్పిన ప్రభుత్వ పెద్దలు ఒక్క డిమాండ్ మాత్రమే నెరవేర్చే దిశగా చర్యలు తీసుకున్నారని అంగన్‌వాడీలు మండిపడుతున్నారు.

కలిసికట్టుగా పనిచేసి టీడీపీని గెలిపిద్దాం



సమావేశంలో మాట్లాడుతున్న రాజగోపాల్

బ్రహ్మసముద్రం, ఏప్రిల్ 8: కలిసికట్టుగా పని చేసి టీడీపీ ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థులను గెలుపించుకుందామని ఎస్ఆర్ కనస్ట్రక్షన్స్ భాగస్వామి రాజగోపాల్ పిలుపునిచ్చారు. సోమవారం పిల్లలపల్లి, గొంచిరెడ్డిపల్లి, నాగిరెడ్డిపల్లి, బ్రహ్మసముద్రం, నంజాపురం గ్రామాల్లో ఆయన పర్యటన చేశారు. ఆయా గ్రామాల్లోని టీడీపీ నాయకులు, కార్యకర్తలు, బూత్ కమిటీ సభ్యులతో సమావేశం నిర్వహించారు. అమిలినేని సురేంద్రబాబు గెలుపే లక్ష్యంగా సైనికులుగా పనిచేయాలని ఆయన కోరారు. కార్యక్రమంలో నాయకులు, కన్వీనర్ శ్రీరాములు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కోమటికుంట్లలో తాగునీటి సమస్య



ట్యాంకర్ వద్ద నీటిని పట్టుకుంటున్న గ్రామస్థులు

పుట్లూరు, ఏప్రిల్ 8: మండలంలోని కోమటికుంట్ల గ్రామంలో తాగునీటి సమస్య ఉధృతమైంది. గ్రామంలో మొత్తం 15బోర్లు ఉన్నాయి. వాటిలో ఒక బోరులో మాత్రమే అరకొరగా నీరు వస్తోంది. బోర్లు అడుగంటిపోవడంతో ట్యాంకర్లతో నీటిని సరఫరా చేస్తున్నారు. ట్యాంకర్లు కూడా రోజుకు రెండు మాత్రమే వస్తుండటంతో చాలీచాలని నీటితో గ్రామస్థులు ఇబ్బందులు పడుతున్నారు. బీసీ, ఎస్సీ కాలనీల్లో పూర్తిగా రాకపోవడంతో గ్రామశివారులో ఉన్న వ్యవసాయ బోర్ల వద్దకు వెళ్లాల్సి వస్తోందని మహిళలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు సరఫరా చేస్తున్న నీటికోసం పనులు విడిచిపెట్టి పగలు రాత్రిళ్లు వేచిచూడాల్సి వస్తోందని గ్రామస్థులు వాపోతున్నారు. ఉన్నతాధికారులు స్పందించి నీటి ట్యాంకర్ల సంఖ్యను పెంచి నీటి సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు.

ఓటు వినియోగంపై అవగాహన



ప్రజలకు అవగాహన కల్పిస్తున్న తహసీల్దార్

కుందుర్పి, ఏప్రిల్ 8: మండలకేంద్రంలోని రామస్వామి ఆలయం వద్ద ఓటర్లకు ఓటు వినియోగంపై తగిన సూచనలు, సలహాలను ఇచ్చినట్లు తహసీల్దార్ హనుమంతు తెలిపారు. ఓటర్లు స్వేచ్ఛగా తమ ఓటు హక్కు వినియోగించుకోవాలని కోరారు. పోలింగ్ కేంద్రాలకు రాలేని అర్హులైన వారికి ఇంటి దగ్గరే ఓటు వేయడానికి అవకాశం కల్పించామని తెలిపారు. కార్యక్రమంలో స్థానిక ఎంపీడీవో చంద్రశేఖర్, మండల విద్యాశాఖాధికారి తిప్పేస్వామి, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

పేకాటరాయుళ్ల అరెస్టు

రాయదుర్గంరూరల్, ఏప్రిల్ 8: పట్టణంలోని ముత్రాసికాలనీలో పేకాట ఆడుతున్న ఆరుగురిని అదుపులోకి తీసుకున్నట్లు సీఐ శ్రీనివాసులు తెలిపారు. పట్టణంలో పేకాట ఆడుతున్నారన్న సమాచారం అందుకున్న పోలీసులు పేకాటస్థావరంపై దాడి చేశారు. రూ.4,500, ఒక మోటార్ సైకిల్‌ను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఆరుగురిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలిస్తున్నట్లు తెలిపారు.

కుందుర్పి: మండలంలోని ఎనుములదొడ్డి గ్రామ సమీపాన పేకాట స్థావరంపై సోమవారం ఎస్ఐ వెంకటస్వామి తన సిబ్బందితో కలిసి దాడులు నిర్వహించారు. దాడుల్లో ఐదుగురు పేకాటరాయుళ్లను అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి రూ.9800 స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ఆదివాసీలపై దాడి చేసిన వారిని శిక్షించాలి

గుంతకల్లుటౌన్, ఏప్రిల్ 8: ఆదివాసుల యువకులపై దాడి చేసిన వారిని కఠినంగా శిక్షించాలని ఎమ్మార్పీఎస్ నాయకులు ఎల్లిపాయల ఆనంద్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా వచ్చిన ఎమ్మెల్సీ అనంతబాబును అల్లూరి సీతారామరాజు జిల్లా కూనవరం మండలం కుటూరు పొలిమేరలో అడ్డుకున్నారు. గతంలో ఇచ్చిన హామీలను నెరవేర్చలేదని నిలదీయడంతో ఆగ్రహానికిలోనైనా ఎమ్మెల్సీ ఆయన అనుచరులు, గన్‌మన్ ఆదివాసీ యువకులపై విచక్షణా రహితంగా దాడి చేసి గాయపరచాడన్నారు. వైఎస్ జగన్ అరాచక పాలనకు, అధికారానికి వచ్చే ఎన్నికల్లో ఓటు ద్వారా ఉరితాడు వేయాలని ఆయన పిలుపునిచ్చాడు.

ప్రచారానికి అనుమతులు తప్పనిసరి: ఆర్ఓ

ఉరవకొండ, ఏప్రిల్ 8: రాజకీయ పార్టీలు ప్రచారానికి అనుమతులు తప్పనిసరిగా తీసుకోవాలని ఆర్ఓ కేతన్‌గార్గ్ పేర్కొన్నారు. పట్టణంలోని తహసీల్దారు కార్యాలయంలో సోమవారం రాజకీయపార్టీలతో సమావేశాన్ని నిర్వహించారు. ఎన్నికలకు రాజకీయ పార్టీ నాయకులందరూ సహకరించాలన్నారు. 85 సంవత్సరాలు దాటిన ఓటర్లను 86మంది దాకా గుర్తించినట్లు తెలిపారు. ఇప్పటి దాకా రూ.8.2లక్షలు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. 15మంంది వలంటీర్లను తొలగించామన్నారు. సీ విజిల్ ద్వారా 21 ఫిర్యాదులు అందాయన్నారు. కార్యక్రమంలో ఈఆర్వో శిరీష, తహసీల్దార్లు శ్రీనివాసులు, హరినాథ్ రాజకీయ పార్టీల నాయకులు పాల్గొన్నారు.

ఓటు వినియోగంపైనే దేశ భవిష్యత్తు



సుంకులమ్మపాలెంలో ర్యాలీ చేస్తున్న పొదుపు సంఘాల సభ్యులు

తాడిపత్రిటౌన్, ఏప్రిల్8: దేశభవిష్యత్తు ఓటు వినియోగంపైనే ఆధారపడి ఉందని తహసీల్దార్ ఆంజనేయులు తెలిపారు. స్థానిక పాత పురపాలక సంఘం కార్యాలయంలో సోమవారం నిర్వహించిన స్వీప్ కార్యక్రమంలో భాగంగా ఓటుహక్కు విలువ గురించి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ తమ ఓటుహక్కును సద్వినియోగం చేసుకోవాల న్నారు. ఓటు అనేది భవిష్యత్తు తరాలకు పునాది వంటిదని తెలియజేశారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ రాంమోహన్, టీపీఓ సతీష్‌కుమార్, వాసుదేవరెడ్డి, రాజ్యలక్ష్మి, పలువురు సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

అభివృద్ధి కోసం టీడీపీని గెలిపించండి: కేశవ్



బాబుష్యూరిటీలో పాల్గొన్న ఎమ్మెల్యే పయ్యావుల కేశవ్

కూడేరు, ఏప్రిల్ 8: రాష్ట్రం అభివృద్ధి చెందాలంటే తెలుగుదేశం పార్టీ అధికారంలోకి రావాలని, అందుకే ప్రతిఒక్కరూ సైకిల్ గుర్తుపై ఓటు వేయాలని ఎమ్మెల్యే పయ్యావుల కేశవ్ అభ్యర్థించారు. మండల కేంద్రంలో సోమవారం బాబుష్యూరిటీ భవిష్యత్తు గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ఇంటింటికి వెళ్లి వైసీపీ పాలన వైఫల్యాలను వివరించారు. తెలుగుదేశం పార్టీ అధికారంలోకి రాగానే అన్ని వర్గాలను ఆర్థికంగా అభివృద్ధి చేయడానికి సూపర్ సిక్స్ పథకాలను అమలు చేస్తామన్నారు. అంతకుముందు ఎమ్మెల్యే పయ్యావుల కేశవ్ కు మహిళలు హారతులతో స్వాగతం పలకగా, పార్టీ శ్రేణులు పూల హారాలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీధర్ చౌదరి, జనసేన నాయకుడు గౌతమ్ తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ బాధితులకు టీడీపీ అండ

● టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి గుమ్మనూరు జయరాం



టీడీపీలోకి చేరుతున్న నెమళ్లపల్లి వైసీపీ నాయకులు

గుంతకల్లు, ఏప్రిల్ 8: వైసీపీ బాధితులైన వారందరికీ తెలుగుదేశం పార్టీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని ఆపార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి గుమ్మనూరు జయరాం పేర్కొన్నారు. సోమవారం ఉదయం స్థానిక టీడీపీ కార్యాలయంలో పట్టణంలోని పదో వార్డు, పామిడి గ్రామానికి చెందిన పలువురు వైసీపీ నాయకులు టీడీపీలో చేరారు. నెమళ్లపల్లికి చెందిన వైసీపీ కన్వీనరు ధనుంజయ, నాయకులు సిద్ధ, సుబ్బరాయుడు, అనిల్, సురేంద్ర, సుదీప్, తదితరులకు గుమ్మనూరు జయరాం పసుపు కండువాలను వేసి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో గుమ్మనూరు నారాయణస్వామి, టీడీపీ లీగల్ సెల్ రాష్ట్ర కార్యదర్శి బీఎస్ కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పామిడి: సార్వత్రిక ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ విజయానికి సమష్టిగా కృషి చేద్దామని ఆ పార్టీ గుంతకల్లు ఎమ్మెల్యే అభ్యర్థి గుమ్మనూరు జయరాం పిలుపునిచ్చారు. పట్టణంలోని బీజేపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి కిరణ్‌గౌడ్ స్వగృహంలో సోమవారం ఆయన అల్పాహార విందుకు హాజరై ఎన్నికల గురించి చర్చించారు. కార్యక్రమంలో ప్రభాకర్ చౌదరి, గౌస్‌పీరా, బొల్లు శ్రీనివాసరెడ్డి, కృష్ణారెడ్డి పాల్గొన్నారు.

● పామిడిలోని 8వ వార్డులోని దత్తాత్రేయ కాలనీకి చెందిన 20 కుటుంబాలు సోమవారం సాయంత్రం గుమ్మనూరు జయరాం తనయుడు గుమ్మనూరు ఈశ్వర్ సమక్షంలో టీడీపీలో చేరాయి. మండలంలోని జీ కొట్టాల గ్రామ ఎస్సీ కాలనీలోని 15 కుటుంబాలు ఆలూరు మార్కెట్ యార్డు చైర్మన్ గుమ్మనూరు నారాయణ సమక్షంలో టీడీపీలో చేరాయి.

సరిహద్దు చెక్‌పోస్టులో నగదు పట్టివేత



నగదుపై విచారిస్తున్న ఎన్నికల అధికారి రాణి సుష్మిత

కళ్యాణదుర్గం, ఏప్రిల్ 8: కంబదూరులోని ఆంధ్ర, కర్ణాటక అంతర్రాష్ట్ర సరిహద్దులో ఉన్న చెక్‌పోస్టు వద్ద సోమవారం రూ.4.39 లక్షలు పట్టుపడినట్లు పోలీసులు తెలిపారు. ఎస్ఐ ఆంజనేయులు, ఎఫ్ఎస్‌టీ టీమ్ సభ్యులు, వీఆర్వో పక్కీరప్ప తదితరులు వాహనాల తనిఖీ చేపట్టారు. కంబదూరు వైపు నుంచి వచ్చిన కేఏ 40 బి 3476 నెంబర్ గల ఒక బొలెరో వాహనంను తనిఖీ చేయగా, ఆ వాహనంలో నలుగురు వ్యక్తులు తీసుకెళుతున్న రూ.4.39 లక్షలు పట్టుబడినట్లు తెలిపారు. ఆ నగదుకు ఎటువంటి ఆధారాలు లేకపోవడంతో సీజ్ చేసి కళ్యాణదుర్గం అసెంబ్లీ నియోజకవర్గం రిటర్నింగ్ అధికారి రాణి సుష్మిత ఎదుట హాజరుపరచినట్లు తెలిపారు.

దరఖాస్తుల ఆహ్వానం

గుత్తి, ఏప్రిల్ 8: పట్టణంలోని మోడల్ కళాశాలలో ఇంటర్ మొదటి సంవత్సరం ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ నీలిమ ఉష తెలిపారు. ఈ ఏడాది పదో తరగతి పాసైన విద్యార్థుల నుంచి ఈనెల 28నుంచి మే 22 వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు స్వీకరిస్తామన్నారు. ఎంపీసీ, బైపీసీ, ఎంఈసీ, సీఈసీ కోర్సులకు దరఖాస్తు చేసుకోవాలన్నారు. పదో తరగతిలో సాధించిన మార్కులు, రిజర్వేషన్ల ఆధారంగా ప్రవేశాలు కల్పిస్తామన్నారు. ఆంగ్ల మాధ్యమం మాత్రమే ఉంటుందన్నారు.

పోలీసు బలగాల కవాతు

తాడిపత్రిటౌన్, ఏప్రిల్8: పట్టణంలో సోమవారం పోలీసుసిబ్బంది, కేంద్రబలగాలు కవాతు నిర్వహించాయి. పట్టణంలోని పుట్లూరురోడ్డు, సంజీవనగర్, విజయనగర్‌కాలనీ, వాటర్‌వర్క్స్‌రోడ్డు, అశోక్‌పిల్లర్, మెయిన్‌బజారు మీదుగా కవాతు సాగింది. కవాతులో డీఎస్పీ గంగయ్య, బీఎస్ఎఫ్ కమాండెంట్ సంతోష్‌భట్, పట్టణ సీఐ మురళీకృష్ణ, ఎస్ఐ గౌస్‌బాషా, నాగవీరయ్య, సిబ్బంది పాల్గొన్నారు.

వడదెబ్బ పట్ల జాగ్రత్తలు తీసుకోవాలి



ఓఆర్ఎస్ ప్యాకెట్లు పంపిణీ చేస్తున్న డాక్టర్ కుమార్‌రాజా

బొమ్మనహాళ్, ఏప్రిల్ 8: వడదెబ్బ పట్ల ప్రజలు జాగ్రత్తలు తీసుకోవాలని శ్రీధరఘట్ట వైద్యాధికారి డాక్టర్ కుమార్‌రాజా అన్నారు. మండలంలోని శ్రీధరఘట్ట గ్రామంలో సోమవారం వడదెబ్బ లక్షణాల గురించి వివరించారు. ఎండల తీవ్రత దృష్ట్యా ప్రజలు ఉదయమే పనులకు వెళ్లి 11 గంటలలోపు ఇంటికి చేరుకోవాలన్నారు. మజ్జిగ, నిమ్మరసం, ఓఆర్ఎస్ వంటి ద్రవపదార్థాలు తాగాలని అన్నారు. తల తిరగడం, తలనొప్పి, శరీరం చల్లబడటం, వాంతులు, విరేచనాలు వంటి లక్షణాలు ఉంటే వెంటనే ఆసుపత్రికి వెళ్లాలని సూచించారు. ప్రజలకు ఓఆర్ఎస్ ప్యాకెట్లను అందించారు. చిన్నారులు, వృద్ధులను బయటకు వదలకూడదు అన్నారు.

ఘనంగా నకారా జయంతి వేడుకలు

తాడిపత్రిటౌన్, ఏప్రిల్ 8: స్థానిక పెన్షనర్ల భవనంలో సోమవారం ధర్మస్వరూప్ నకారా జయంతి వేడుకలు జరిగాయి. పెన్షనర్ల సంఘం అధ్యక్షుడు సత్యప్రసాద్‌రెడ్డి ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పెన్షన్ భిక్షకాదు హక్కు అని కోర్టు ద్వారా యాక్ట్ తెచ్చిన మహనీయుడు నకారా అని కొనియాడారు. కార్యక్రమంలో సంఘం సభ్యులు పాల్గొన్నారు.

పన్నుపై రాయితీ

తాడిపత్రిటౌన్, ఏప్రిల్ 8: ఇంటిపన్ను, ఖాళీ స్థలాలపై పన్నులు ఈనెల 30లోగా చెల్లిస్తే 5శాతం రాయితీ ఇవ్వనున్నట్లు మున్సిపల్ కమిషనర్ రాంమోహన్ తెలిపారు. పట్టణంలోని గృహ యజమానులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

రామాలయంలో ఉగాది పూజలు



అలంకరణలో శ్రీరామచంద్రమూర్తి

యాడికి, ఏప్రిల్ 8: ఉగాది పండుగను పురస్కరించుకొని యాడికిలోని రామాలయంలో సోమవారం ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. స్వామివారిని దర్శించుకోవడానికి భక్తులు పెద్దఎత్తున తరలివచ్చారు. తాడిపత్రి మున్సిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్‌రెడ్డి రాముల వారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేయించారు. ఆలయ కమిటీ సభ్యులు వేణు గోపాల్, కుమార్‌రావు, బాబురావు తదితరులు పాల్గొన్నారు. మంగళవారం స్వామివారి కల్యాణం, గ్రామోత్సవం నిర్వహించను న్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

ద్విచక్రవాహనాన్ని ఢీకొన్న కారు

కళ్యాణదుర్గం రూరల్, ఏప్రిల్ 8: మండలంలోని మల్లికార్జునపల్లి గేట్ వద్ద కారు ఢీకొట్టిన ఘటనలో ద్విచక్ర వాహనదారుడు బోయ నాగరాజు తీవ్రంగా గాయపడ్డాడు. పోలీసులు తెలిపిన మేరకు పట్టణానికి చెందిన బోయ నాగరాజు పని నిమిత్తం మల్లికార్జునపల్లి వెళ్లి తిరిగి వస్తుండగా రాయదుర్గం వైపు నుండి వస్తున్న కారు వెనుక వైపు నుంచి ఢీకొట్టింది. దీంతో ద్విచక్ర వాహనదారుడు తీవ్రంగా గాయపడ్డాడు. వెంటనే 108లో కళ్యాణదుర్గం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. రూరల్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

పల్లెల్లో జోరుగా పేకాట

బొమ్మనహాళ్, ఏప్రిల్ 8: పచ్చని కాపురాను పేకాట మూడు ముక్కలు చేస్తోంది. వ్యసనానికి బానిసలైన వారు అన్నీ పోగొట్టుకుని రోడ్డున పడుతున్నారు. మండలంలోని కొన్ని గ్రామాలలో కొందరు వైసీపీ నాయకుల కనుసన్నల్లో పేకాట స్థావరాలు సందడిగా సాగుతున్నాయన్న ఆరోపణలు ఉన్నాయి. ఓడిన ఆడాలనుకునే పేకాట రాయుళ్లకు ఆస్తులు తనఖా పెట్టుకుని అప్పులు ఇచ్చేది కూడా ఆ స్థావరం నిర్వాహకులే. మండలంలోని కురవళ్లి, ఉద్దేహాళ్ గ్రామాల శివార్లలో పేకాట శిబిరాలు జోరుగా సాగుతున్నాయన్న విమర్శలు వస్తున్నాయి. ఇటీవల ఉద్దేహాళ్ గ్రామ శివార్లలో జూదం ఆడుతూ వైసీపీకి చెందిన యూత్ నాయకుడు పట్టుపడిన ఘటనలు కూడా ఉన్నాయి. గ్రామాలలో జోరుగా జూదాలు ఆడుతున్నా, స్పెషల్ బ్రాంచ్ పోలీసులకు తెలిసినా వాటిని ఉన్నతాధికారులకు చేరవేయడంలో విఫలమవుతున్నారని విమర్శలు ఉన్నాయి.


ఎవరినీ ఉపేక్షించం: ఎస్ఐ శ్రీనివాసులు, బొమ్మనహాళ్

పేకాట స్థావరాలు నిర్వహిస్తున్నట్లు మా దృష్టికి వస్తే ఉపేక్షించేదిలేదు. గ్రామీణ ప్రాంతాలలో జూదాలు ఆడుతున్న సమాచారాన్ని మాకు అందించాలి. పేకాట స్థావరాలు నడుపుతున్న వారిలో ఎవరున్నా వదిలేది లేదు.

చీనీకాయలు టన్ను రూ.35 వేలు

అనంతపురంరూరల్: అనంతపురం వ్యవసాయ మార్కెట్‌లో సోమవారం చీనీకాయలు టన్ను గరిష్ఠంగా రూ.35 వేలు, కనిష్ఠంగా రూ.12,500, సరాసరి రూ.21 వేలతో అమ్ముడుపోయినట్లు మార్కెట్ ఎంపిక శ్రేణి కార్యదర్శి జయలక్ష్మి తెలిపారు. మార్కెట్‌కు మొత్తంగా 707 టన్నుల చీనీకాయలు వచ్చాయన్నారు.

పారదర్శక ఎన్నికలే లక్ష్యం: ఎస్పీ



అనంతపురం క్రైం, ఏప్రిల్ 8: జిల్లాలో పారదర్శక ఎన్నికలే లక్ష్యంగా పోలీసు వ్యవస్థ పనిచేయాలని జిల్లా ఎస్పీ అమిత్ బర్దర్ సూచించారు. స్థానిక పోలీసు కాన్ఫరెన్స్ హాలులో పోలీసు అధికారులతో సోమవారం నిర్వహించిన ప్రత్యేక సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్నికల కమిషన్ నియమ నిబంధనలు అందరూ తప్పకుండా పాటించాలన్నారు. ప్రజలు స్వేచ్ఛగా, నిర్భయంగా ఓటు హక్కు వినియోగించుకునేలా పటిష్ట చర్యలు తీసుకోవాలన్నారు.

రైలు నుంచి జారి పడి యూపీ యువకుడి మృతి

గుంతకల్లుటౌన్, ఏప్రిల్ 8: గుంతకల్లు-పామిడి రైలు మార్గంలోని గూళ్లపాళ్యం రైల్వే స్టేషన్ సమీపంలో ప్రమాదవశాత్తు రైల్లో నుంచి జారీ పడి ఉత్తరప్రదేశ్‌కు చెందిన విశాల్ గోసై(24) మృతి చెందినట్లు జీఆర్పీ ఎస్ఐ మహేంద్ర సోమవారం తెలిపారు. అనంతపురం నుంచి ఆదివారం కోయంబత్తూర్-ముంబాయి ఎక్స్‌ప్రెస్ రైలులో ఉత్తరప్రదేశ్‌కు చెందిన విశాల్ గోసై బయలు దేరాడు. గూళ్లపాళ్యం స్టేషన్ దాటిన తరువాత ప్రమాదవశాత్తు రైలులో నుంచి కింద పడగ 271-07పోల్‌కు ఢీకొని తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి వద్ద లభించిన ఆధార్ కార్డు ద్వారా అతడి ఊరు వివరాలు తెలిశాయన్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గుంతకల్లు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

పండుగ పూట కిటకిట

తాడిపత్రిటౌన్, ఏప్రిల్ 8: ఉగాది పండును పురస్కరించుకొని పట్టణంలోని దినసరి కూరగాయల మార్కెట్, పోలీస్‌స్టేషన్ సర్కిల్, యల్లనూరురోడ్డు, పుట్లూరురోడ్డు జనాలతో కిక్కిరిసిపోయాయి. పండుగను పురస్కరించుకొని మార్కెట్‌లో కూరగాయలు, పూజకు కావాల్సిన సామగ్రిని కొనుగోలు చేయడానికి ప్రజలు అధిక సంఖ్యలో వచ్చారు. గ్రామాల నుంచి ఆటోల్లో మామిడిఆకులు, మామిడి కాయలు, పూలు, అరటిఆకులు తీసుకువచ్చి పట్టణంలోని పోలీస్‌స్టేషన్ సర్కిల్, యల్లనూరురోడ్డు, అశోక్‌పిల్లర్, బస్టాండ్ సర్కిల్ ప్రాంతాల్లో విక్రయించారు. అధిక సంఖ్యలో జనాలు రావడంతో ప్రధాన కూడళ్లలో ట్రాఫిక్ స్తంభించంది. పోలీస్‌స్టేషన్ నుంచి నవరంగ్‌టాకీస్‌రోడ్డు వరకు వెళ్లాలంటేనే అరగంట పట్టింది. పోలీస్‌స్టేషన్ బయటే తీవ్ర ట్రాఫిక్ ఉన్నప్పటికి పోలీసులు మాత్రం అటువైపు కన్నెత్తి చూడలేదు.



కిక్కిరిసిన కూరగాయల మార్కెట్



పోలీస్‌స్టేషన్ సర్కిల్‌లో మామిడి ఆకుల విక్రయం

తాడిపత్రిలో బాబు ష్యూరిటీ



యువతితో మాట్లాడుతున్న జేసీ అశ్మిత్‌రెడ్డి

తాడిపత్రిటౌన్, ఏప్రిల్ 8: పట్టణంలోని శ్రీరాములపేట, గణేష్‌నగర్‌లో సోమవారం బాబు ష్యూరిటీ భవిష్యత్తు గ్యారెంటీ కార్యక్రమానికి టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి జేసీ అశ్మిత్‌రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన ఇంటింటికి వెళ్లి ప్రజల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. టీడీపీ ప్రకటించిన సూపర్ సిక్స్ పథకాల గురించి ప్రజలకు వివరించారు. సైకిల్ గుర్తుకు ఓటువేసి గెలిపించాలని ప్రజలను కోరారు. కార్యక్రమంలో జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జ్ కదిరి శ్రీకాంత్‌రెడ్డి, టీడీపీ నాయకులు పవన్ కుమార్‌రెడ్డి, హరినాథ్‌రెడ్డి, సుదర్శన్‌రెడ్డి, లోక్‌నాథ్‌రెడ్డి, బీజేపీ నాయకులు రంగనాథ్‌రెడ్డి, గంగాదర్, శింగరి లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

అభివృద్ధి చేసేవారికే ఓటువేయండి: జేసీపీఆర్



వృద్ధురాలిని పలకరిస్తున్న ప్రభాకర్‌రెడ్డి

యాడికి, ఏప్రిల్ 8: ప్రజాధనాన్ని దోచుకునే వారికి కాకుండా అభివృద్ధి పనులు చేపట్టే నాయకులకు ఓటువేయాలని తాడిపత్రి టీడీపీ మున్సిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్‌రెడ్డి గ్రామస్థులకు సూచించారు. మండల కేంద్రంలో సోమవారం పర్యటించిన ఆయన పలువురు గ్రామస్థులను కలిసి సమస్యలపై ఆరాతీశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఓటే మన ఆయుధమని దానిని అందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ప్రజల సంక్షేమం, రాష్ట్ర అభివృద్ధి టీడీపీతోనే సాధ్యమన్నారు. ఎన్నికల్లో టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి జేసీ అశ్మిత్‌రెడ్డికి అండగా నిలవాలని ఆయన కోరారు. ఆయన వెంట మాజీ ఎంపీపీ వేలూరు రంగయ్య, మాజీ ఎంపీటీసీ ఆదినారాయణ, రామకృష్ణ, చంద్రశేఖర్‌రెడ్డి, చలమారెడ్డి, చాంద్ బాషా, హాజీబాషా, రహంతుల్లా, లక్ష్మణ్, చంద్ర ఉన్నారు.

పట్టణంలో పర్యటించిన జేసీపీఆర్

తాడిపత్రిటౌన్: పట్టణంలోని యల్లనూరు రోడ్డులోని పలువీధుల్లో సోమవారం టీడీపీ మున్సిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్‌రెడ్డి విస్తృతంగా పర్యటించారు. ఇంటింటికీ వెళ్లి ప్రజల సమస్యలపై ఆరా తీశారు. వచ్చే ఎన్నికల్లో టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి జేసీ అశ్మిత్‌రెడ్డిని గెలిపించాలని కోరారు. ఆయన వెంట పవన్‌కుమార్‌రెడ్డి, హరినాథ్‌రెడ్డి, మల్లికార్జునరెడ్డి, రామాంజనేయులు, కార్తీక్ తదితరులు ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో మహిళ దుర్మరణం

గుత్తిరూరల్, ఏప్రిల్ 8: మండలంలోని లచ్చానిపల్లి గ్రామశివారులో సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో హుస్సేనమ్మ (50) మృతి చెందగా మరొకరికి గాయాలయ్యాయి. గుంతకల్లు మండలం కొంగనపల్లికి చెందిన హుస్సేనమ్మ ఆటోలో గుత్తి నుంచి గ్రామానికి వెళ్తుండగా లచ్చానిపల్లి శివారులో ఎదురుగా వస్తున్న ద్విచక్రవాహనం ఢీ కొట్టింది. దీంతో ఆటోలో నుంచి హుస్సేనమ్మ కిందపడి అక్కడికక్కడే మృతి చెందింది. మైనాపురం తండ గ్రామానికి చెందిన ద్విచక్రవాహనదారుడు దీప్లా నాయక్‌కు తీవ్రగాయాలయ్యాయి. అతడిని స్థానికులు గుత్తి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతుదేహాన్ని గుత్తి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ సంఘటనపై పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు.

పొగాకు పంట దగ్ధం

తాడిపత్రిటౌన్, ఏప్రిల్8: మండలంలోని ఊరుచింతల గ్రామానికి చెందిన తలారి కిట్టుకు సంబంధించిన పొగాకుకు ఆదివారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు నిప్పుపెట్టడంతో అగ్నికి ఆహుతైందని రూరల్ పోలీసులు తెలిపారు. కిట్టు మూడెకరాల్లో పొగాకు పంట సాగుచేశాడు. కోతకోసి పొలంలోనే ఆరబెట్టి ఇంటికి వచ్చాడు. గుర్తుతెలియని వ్యక్తులు నిప్పుపెట్టడంతో పంట మొత్తం కాలిపోయింది. ఈ సంఘటనతో దాదాపు రూ.1.5లక్షలు నష్టం వాటిల్లింది. బాధితుడి ఫిర్యాదుమేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

నీటిదొనలో పడి అడవి పంది మృతి

కళ్యాణదుర్గం, ఏప్రిల్ 8: నీటిదొనలో పడి ఓ అడవి పంది మృతి చెందినట్లు కంబదూరు మండలం కురాకులపల్లి గ్రామస్థులు సోమవారం తెలిపారు. గ్రామ సమీపంలో ఉన్న పాల్యం ఆంజనేయస్వామి దేవాలయం వెనుకవైపు వున్న నీటి దొనలో మృతి చెందినట్లు వారు వెల్లడించారు. కురాకులపల్లి సమీపంలో అటవీ ప్రాంతం ఎక్కువగా ఉండటంతో వన్యప్రాణులు కూడా ఎక్కువగా సంచరిస్తుంటాయి. ఈ దేవాలయ సమీపంలో చిన్న నీటిదొన ఉండటంతో అటవీ మృగాలు తరచూ ఇక్కడికి వచ్చి దాహార్తి తీర్చుకుంటుంటాయని గ్రామస్థులు పేర్కొన్నారు. వేసవి నేపథ్యంలో నీటి దొన కూడా పూర్తిగా ఎండిపోవడంతో వన్య మృగాలు అక్కడ వరకు వచ్చి మృత్యువాత పడుతున్నాయి. అటవీశాఖ అధికారులు స్పందించి కురాకుల పల్లి అటవీ ప్రాంతంలో వన్యమృగాలకు నీటి సౌకర్యం ఏర్పాటు చేయాలని గ్రామస్థులు కోరుతున్నారు.

ట్రాన్స్‌ఫార్మర్‌ను ధ్వంసం చేసిన దుండగులు



ధ్వంసమైన ట్రాన్స్‌ఫార్మర్

కూడేరు, ఏప్రిల్ 8: మండలంలోని మరుట్ల 3వ కాలనీకి చెందిన రైతు రఘునాథ్ తోటలో గుర్తు తెలియని దుండగులు ట్రాన్స్‌ఫార్మర్ ధ్వంసం చేశారు. దీంతో కరెంటు సరఫరా పూర్తిగా నిలిచిపోయింది. ఆదివారం రాత్రి తోటలోనున్న ట్రాన్స్‌ఫార్మర్ ధ్వంసం చేసి అందులోనున్న విలువైన సామగ్రిని దొంగిలించారని బాధితుడు తెలిపాడు. సోమవారం తోటకు వచ్చి చూడగా ట్రాన్స్‌ఫార్మర్ ధ్వంసం అయ్యిఉండటాన్ని గమనించి పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు వెల్లడించారు. కరెంటు లేకపోవడంతో తోటకు నీరు అందించేందుకు ఇబ్బందులు పడుతున్నామని, అధికారులు స్పందించి ట్రాన్స్‌ఫార్మర్ త్వరగా ఇవ్వాలని కోరారు.

రాజకీయ పార్టీల నాయకులతో ఆర్ఓ సమావేశం

తాడిపత్రిటౌన్, ఏప్రిల్8: స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం పలు రాజకీయపార్టీల నాయకులతో రిటర్నింగ్ అధికారి రాంభూపాల్‌రెడ్డి సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఓటరుగా నమోదు చేసుకోవడానికి ఈనెల 14వరకు అవకాశం ఉందన్నారు. 85సంవత్సరాలు నిండిన వారు ఇంటివద్దనే ఓటు హక్కును వినియోగించుకోవాలనుకుంటే ముందుగా ఫారం-12డీ ఇవ్వాల్సి ఉంటుందన్నారు. నామినేషన్ల ప్రక్రియ, ఉపసంహరణ తదితర వాటిపై వారికి అవగాహన కల్పించారు. సమావేశంలో తహసీల్దార్ ఆంజనేయులు, పెద్దపప్పూరు తహసీల్దార్ రాజశేఖర్, యాడికి తహసీల్దార్ మోహనవల్లి, పెద్దవడుగూరు తహసీల్దార్ శేషరాంసింగ్, ఎన్నికల డిప్యూటీ తహసీల్దార్ శ్రీనివాసులు, సిబ్బంది పాల్గొన్నారు.